# మన నేషనలిస్ట్ వాయిస్

తెలుగు దిన పత్రిక

RNI : TGTEL/25/A4284

www.mananationalistvoice.com epaper.mananationalistvoice.com

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 128 | 04 శనివారం, ఏప్రిల్ 2026 | పేజీలు :12 | వెల: రూ. 3/-

హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ణ, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం









# టెక్స్‌టైల్‌రంగంలో... తెలంగాణ అగ్రగామి

- ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారికి ప్రోత్సహిస్తాం
- చేనేత, ముత్యాలకు పెట్టింది పేరు తెలంగాణ
- ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్

**హైదరాబాద్,ఏప్రిల్3(నేషనలిస్ట్ వాయిస్):**

తెలంగాణ రైజింగ్‌లో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో నిర్వహించిన ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఉత్తమ వస్త్రాల రూపకల్పనలో భారత్‌కు గొప్ప చరిత్ర ఉంది. అనేక రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతోంది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే మా లక్ష్యం. పెట్టుబడిదారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం. ...మిగతా 2 లో...



## గ్రూప్-1 నియామకాలపై సుప్రీం తీర్పు..!

- ఎక్స్ వేదికగా స్వాగతించిన సీఎం రేవంత్

**హైదరాబాద్,ఏప్రిల్3(నేషనలిస్ట్ వాయిస్):**

తెలంగాణ గ్రూప్-1 నియామకాలపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. తెలంగాణ గ్రూప్ -1 ఉద్యోగ నియామకాల విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

...మిగతా 2 లో...



## తెలంగాణలో ఏం చేశారని కేరళ ప్రచారం వెళ్లారు

- సిఎం రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి విమర్శలు

**హైదరాబాద్,ఏప్రిల్3(నేషనలిస్ట్ వాయిస్):**

కేరళ ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి భాజపాపై తప్పుడు ఆరోపణలు చేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు.

...మిగతా 2 లో...





## స్కూల్ ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

- ఆనాడు మాట్లాడిన రేవంత్ ఇప్పుడు మాట్లాడడం లేదు
- టిఆర్ఎస్ పేరు ఖాళీగా ఉంది..ఎవరైనా వాడుకోవచ్చు
- జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్,ఏప్రిల్3(నేషనలిస్ట్ వాయిస్):**

రాష్ట్రంలో స్కూల్ ఫీజుల గొడవ నడుస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 39,640 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 12,061 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. సీబీఎస్సీ సెంట్రల్ సిలబస్ ఉన్న స్కూల్స్‌లో 25 నుంచి 30 శాతం ఫీజులు పెంచి ఇప్పటి నుంచే వసూలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు ఫీజు నియంత్రణ చట్టం చేయాలని రేవంత్ రెడ్డి పదే పదే మాట్లాడారని గుర్తుచేశారు. ఎవరెంత తిన్నారంటూ అసెంబ్లీలో చర్చ చేసుకున్నారే తప్ప ఫీజుల నియంత్రణపై మాట్లాడలేదని విమర్శించారు. ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించి ఫీజు నియంత్రణ చట్టం వెంటనే తేవాలని కవిత డిమాండ్ చేశారు.

...మిగతా 2 లో...

## అమిత్ షా హెలికాప్టర్ లో సాంకేతిక లోపం



కేంద్ర హోం మంత్రి అమిత్ షా అసోం పర్యటనలో ఊహించని అంతరాయం ఏర్పడింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ప్రయాణించాల్సిన హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో దుబ్రీ జిల్లా గోలక్‌గంజ్ పర్యటన రద్దయింది.పర్యటన రద్దయినప్పటికీ, సభా ప్రాంగణానికి భారీగా తరలివచ్చిన కార్యకర్తలను నిరాశపరచకుండా అమిత్ షా ఒక వినూత్న నిర్ణయం తీసుకున్నారు. మొబైల్ ఫోన్ ద్వారా సభను ఉద్దేశించి ప్రసంగించారు. సాంకేతిక లోపం వల్ల తాను భౌతికంగా హాజరుకాలేకపోతున్నానని, ఇందుకు చింతిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. అసోం అభివృద్ధి పట్ల తన నిబద్ధత ఎప్పటికీ కొనసాగుతుందని, బీజేపీ అభ్యర్థి అశ్విని రాయ్ సర్కార్ గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.హెలికాప్టర్ లోపాన్ని సరిదిద్దిన తర్వాత లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా ఆయన తన తదుపరి ఎన్నికల పర్యటనలను కొనసాగించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# ఇరాన్ గడ్డపై కూలిన ఎఫ్-35...

## పైలట్ ను కాపాడేందుకు అమెరికా విఫలయత్నాలు?

ఇరాన్ గగనతలంలో తమ ఎఫ్-35 ఫైటర్ జెట్ కూలిపోవడంతో, అందులోని పైలట్‌ను కాపాడేందుకు అమెరికా ముమ్మర ప్రయత్నాలు చేస్తోందని ఇరాన్ మీడియా సంస్థ తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. పశ్చిమ ఇరాన్‌లోని కోగిలుయే, బోయర్-అహ్మద్ ప్రావిన్సులలో అమెరికా దళాలు శుక్రవారం నుంచి గాలింపు చర్యలు చేపట్టాయని తెలిపింది. బ్లాక్ హాక్ హెలికాప్టర్లు, సీ-130 హెర్క్యులస్ విమానాలతో గాలిస్తున్నప్పటికీ, ఇప్పటివరకు వారి ప్రయత్నాలు ఫలించలేదని ఈ మేరకు ఓ కథనాన్ని ప్రచురించింది.సెంట్రల్ ఇరాన్‌లో తమ అధునాతన రక్షణ వ్యవస్థతో అమెరికాకు చెందిన రెండో ఎఫ్-35 ఫైటర్ జెట్‌ను కూల్చివేసినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) శుక్రవారం ప్రకటించింది. లేకెన్‌హీత్ స్క్వాడ్రన్‌కు చెందిన ఈ యుద్ధ విమానం పూర్తిగా ధ్వంసమై కూలిపోయిందని తెలిపింది. అయితే, దాడి నుంచి తప్పించుకున్న పైలట్ పారాచూట్ సాయంతో ఇరాన్ భూభాగంలోనే ల్యాండ్ అయినట్లు సమాచారం.పైలట్ బతికే ఉంటాడని భావిస్తున్న అమెరికా, అతడిని ఇరాన్ సరిహద్దుల నుంచి బయటకు తీసుకురావాలని చూస్తోందని వార్తలు వస్తున్నాయి. అయితే, ఆ పైలట్‌ను ఇరాన్ సైనిక దళాలు ఇప్పటికే అదుపులోకి తీసుకుని ఉండవచ్చని కొన్ని వర్గాలు చెబుతున్నట్లు తస్నిమ్ తన కథనంలో పేర్కొంది.గత వారం కూడా ఓ అమెరికా ఎఫ్-16 ఫైటర్ జెట్‌ను, ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌ను కూల్చివేసినట్లు ఐఆర్‌జీసీ ప్రకటించడం తెలిసిందే. ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేస్తుండగా, ఇరాన్, దాని మిత్రపక్షాలు కూడా మధ్యప్రాచ్యంలోని అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలపై ప్రతిదాడులకు దిగుతున్నాయి. ఈ క్రమంలోనే తాజా ఘటన చోటుచేసుకుంది.



## బిఆర్ఎస్‌లో ఇంటి గొడవలు

- బిజెపిలో రాముడి రాజకీయం
- ఈ రెండు పార్టీలకు తెలంగాణలో కాలం చెల్లింది
- ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే వందసీట్లు సాధిస్తాం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కమార్ గౌడ్

**మంచిర్యాల,ఏప్రిల్3(నేషనలిస్ట్ వాయిస్):**

తెలంగాణ రాజకీయాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఉనికి కోల్పోయిందని, బీజేపీకి రాష్ట్రంలో స్థానం లేదని ఆయన అన్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో కాంగ్రెస్ నేతలతో భేటీ అయిన ఆయన.. ఈ మేరకు ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని రకాల కుట్రలు పన్నినా.. కాంగ్రెస్‌పై ప్రజలకు ఎంతో నమ్మకం ఉంది. అందుకు ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో కొంత కాలంగా అంతర్గత కలహాలు కొనసాగుతున్నాయి. కేసీఆర్ కుటుంబంలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. కవిత వేరు కుంపటి పెట్టుకోవడంతో బీఆర్ఎస్ పరిస్థితి రోడ్డున పడిందన్నారు. ...మిగతా 2 లో...

# గిరిజనుల రిజర్వేషన్లు పెంచాం

- తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చాం
- ఫీజు రియంబర్స్‌మెంట్ కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం
- బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

**నారాయణపేట,ఏప్రిల్3(నేషనలిస్ట్ వాయిస్):**



గిరిజనులకు ఉన్న 6 శాతం రిజర్వేషన్‌ని 10 శాతానికి పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనతా ఆయనకే దక్కుతుందన్నారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం బావోజీ జాతరకు మాజీ మంత్రులు హరీశ్ రావు, శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..'లోక్ మసంద్ మహారాజ్ జాతరకు రావడం సంతోషంగా ఉంది. ఈ ప్రాంతానికి రూ.8 కోట్లతో బ్రిడ్జి వేయించింది మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి. ఈ దేవాలయ అభివృద్ధికి, గిరిజనుల అభివృద్ధికి కేసీఆర్ ఎంతో చేశారు. మా తండాలో మా రాజ్యం అంటే ఎవ్వరూ పట్టించుకోలేదు. తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌ది. అన్ని రంగాల్లో కేసీఆర్ వారికి రిజర్వేషన్లు తెచ్చారు. గిరిజనులకు ఇప్పుడు కాంగ్రెస్ చేసింది గుండు సున్నా. ఎస్సీ, ఎస్టీలకు డిక్లరేషన్ ఇచ్చి వారు చేసిందేమీ లేదు. రూ.2,730 కోట్లు ఎస్టీలకు బ్జడెట్‌లో పెట్టి కేవలం రూ.50 కోట్లే ఖర్చు చేశారు. ...మిగతా 2 లో...



## రాఘవచద్దాను తొలగిస్తూ ఆప్ నిర్ణయం

- సభలో మాట్లాడే అవకాశం ఇవ్వరాదని లేఖ
- ఆప్ తీరుపై మండిపడ్డ రాఘవ్ చద్దా
- ప్రజా సమస్యలపై గొంతెత్తితే తట్టుకోలేరా?
- వీడియో విడుదల చేసిన రాఘవ్ చద్దా

**న్యూఢిల్లీ,ఏప్రిల్3(నేషనలిస్ట్ వాయిస్):**

రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చద్దాను ఆ పదవి నుంచి ఆప్ తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా తాజాగా స్పందించారు. తానేం తప్పు చేశానంటూ పార్టీని బహిరంగంగా ప్రశ్నించారు. ఇలాంటి ప్రయత్నాలతో తన గళాన్ని అణచివేయగలరేమో గానీ.. తనను ఓడించ లేరంటూ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. పార్లమెంట్‌లో నాకు ఎప్పుడు మాట్లాడే అవకాశం లభించినా..

...మిగతా 2 లో...

# టెక్స్‌టైల్‌రంగంలో... తెలంగాణ అగ్రగామి

మొదటిపేజీ తరువాయి

టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు.. చేనేతలకు జీవితం. దక్షిణాసియా టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాం. ప్రపంచంలోనే ఫిల్మ్ ప్రొడక్షన్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ మారింది. చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తాం. పర్యావరణ పరిరక్షణకెళి మా తొలి ప్రాధాన్యం అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన టెక్స్‌టైల్ రంగ ప్రముఖులకు స్వాగతం పలుకుతూ, తెలంగాణను ప్రపంచ వస్త్ర రంగ పటంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వ దార్శనికతను పంచుకున్నారు .తెలంగాణకు వస్త్ర రంగంతో ఉన్న చారిత్రక అనుబంధాన్ని గుర్తుచేశారు. భారతదేశానికి అత్యుత్తమ వస్త్రాలను తయారు చేసిన గొప్ప చరిత్ర ఉంది. తెలంగాణ గర్వంగా చెబుతోంది.. టెక్స్‌టైల్ మన డిఎన్ఎలోనే ఉంది. నిజాం కాలంలోనే ప్రపంచ నలుమూలల నుండి వ్యాపారులు హైదరాబాద్ కు వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేసేవారు అని ఆయన పేర్కొన్నారు. కేవలం పరిశ్రమగానే కాకుండా, ఇది లక్షలాది మందికి జీవనాధారమని.. పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, వరంగల్ దుర్రీస్ వంటివి మన సంస్కృతికి ప్రతీకలని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047' గురించి ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధిపై స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను వివరిస్తూ, 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను సీఎం ప్రకటించారు. ఇందులో భాగంగా 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడమే లక్ష్యం అని పేర్కొన్నారు. ఇంకా 2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాలోనే టెక్స్‌టైల్ రాజధానిగా మార్చడమే మా సంకల్పం అని అన్నారు. అలాగే వరంగల్‌లో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పత్తి నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని, పత్తి ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రగామిగా ఉందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా పెట్టుబడిదారులకు ఆయన పిలుపునిస్తూ.. 'మీకు విజన్ ఉంటే, మేము మీకు సరైన భాగస్వాములం. మౌలిక సదుపాయాలు, భూమి, విద్యుత్, నీరు, వేగవంతమైన అనుమతులతో పాటు ప్రపంచ స్థాయి విధానాలను మా ప్రభుత్వం అందిస్తుంని అంటూ హామీ ఇచ్చారు. డీప్ టెక్, ఫార్మా, ఏరోస్పేస్ వంటి రంగాల్లో ఇప్పటికే ముందంజలో ఉన్న తెలంగాణ, ఇప్పుడు టెక్స్‌టైల్ ఎకోసిస్టమ్ ను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. మరోవైపు హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ సినిమా నిర్మాణ కేంద్రంగా ఎదుగుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలను ప్రారంభించడాన్ని ఆయన ప్రస్తావించారు. టాలీవుడ్, బాలీవుడ్ మాత్రమే కాక హాలీవుడ్ కూడా హైదరాబాద్ ను కేంద్రంగా చేసుకుంటున్న తరుణంలో సినిమా రంగానికి అవసరమైన ఫ్యాషన్ ను కూడా తెలంగాణ నుంచే అందించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ 'గ్రీన్ టెక్స్‌టైల్ హబ్' లను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు.

# బిఆర్ఎస్‌లో ఇంటి గొడవలు

మొదటిపేజీ తరువాయి

పార్టీలో కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. మాజీ సీఎం కేసీఆర్ రాజకీయాలకు దూరమై.. కేవలం తన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఆయన అసెంబ్లీకి కూడా రావడం లేదు. ఇలాంటి పరిస్థితిలో బిఆర్ఎస్ రోజురోజుకు దిగజారుతోందని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీజేపీ.. దేవుళ్ల పేరు చెప్పి ఓట్లు అడుగుతోంది. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు.. అందుకే ఆ పార్టీని దూరం పెడుతున్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుంది. రాష్ట్రంలో 100 సీట్లు ఖాయం' అని అన్నారు. బీజేపీ కులం, మతం పేరుతో రాజకీయాం చేస్తోందని. .ఆ పార్టీకి తెలంగాణలో స్థానం లేదని విమర్శించారు. రాముడేమైనా బీజేపీ జాగీరా....వాళ్ల పార్టీల సభ్యత్వం ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేనట్టుగా తెలంగాణలో ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. సన్నబియ్యం పథకం దేశంలోనే చారిత్రాత్మకమన్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు కాంగ్రెస్ కడుతోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో నేతల జేబుల్లోకి డబ్బులు వెళ్లాయన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు స్కీం సక్సెస్ గా నడుస్తోందన్నారు. బీజేపీ రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వట్లేదన్నారు. కేంద్రం లాభాల్లో ఉన్న సంస్థలను అమ్మేస్తోందని విమర్శించారు. 12 ఏండ్లలో కేంద్రం ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు మహేశ్ కుమార్ గౌడ్. ఇందిగాంధీ నుంచి రాహుల్ వరకు పేదల కోసం పనిచేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారని అన్నారు.



దోచుకున్న సొత్తులో వాటాల గొడవలతో ఆ పార్టీ రోడ్డున పడిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ కు 100 సీట్లు గ్యారంటీ అని ధీమా వ్యక్తం చేశారు. గ్లోబల్ సమ్మిట్ తో 5 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగా యన్నారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని చెప్పారు మహేశ్ కుమార్ గౌడ్. ఈ కర్యాక్రమంలో మంత్రి వివేక్‌తో పాటు స్థానిక నేతలు పాల్గొన్నారు.

# వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ

## ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్ల నుంచి అక్రమాలపై ఆరా

## తనిఖీల్లో అక్రమ లావాదేవీలు, లంచాలు గుర్తింపు

## భారీగా నగదు, నగలు, అనేక డాక్యుమెంట్లు స్వాధీనం

వరంగల్,ఏప్రిల్3(నేషనలిస్ట్ వాయిస్):

వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నగదు, డాక్యుమెంట్లు ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ల నుంచి స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్–1 జమాలపురం రామనరసింహారావు, రిజిస్ట్రార్–2 దేవులూరి ఆనంద్ ఫోన్లను స్వాధీనం చేసుకుని పరిశీలించారు. ఇద్దరు అధికారులు డాక్యుమెంట్ రైటర్లతో జరిపిన ఫోన్ పే పరిశీలించగా సుమారు రూ.42 లక్షలు లావాదేవీలు జరిపినట్లు గుర్తించారు. వీరి వద్ద నుంచి 70 రిజిస్ట్రేషన్ కాని డాక్యుమెంట్లను పరిశీలించారు. అదే విధంగా ఇద్దరు ఇళ్ల నుంచి రూ.24.61 లక్షల నగదును, 819.500 గ్రాముల బంగారు ఆభరణాలను, 2.600 కిలో గ్రాముల వెండి ఆభరణాలను, రూ.30 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లను గుర్తించారు. ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు గుర్తించి ప్రభుత్వానికి పంపనున్నట్లు వెల్లడించారు. వరంగల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అవినీతి అక్రమాలపై అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదులు అందడంతో మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సబ్ రిజిస్ట్రార్ల అక్రమ లావాదేవీలు, అనధికారిక వ్యక్తులతో వారు సాగిస్తున్న చీకటి ఒప్పందాలు వెలుగులోకి వచ్చాయి. సబ్ రిజిస్ట్రార్లయిన జమాల్పూర్ రామ్ నర్సింహారావు, దేవులూరి ఆనంద్ తమ కార్యాలయంలో ఇద్దరు వ్యక్తులను అనధికారికంగా డాక్యుమెంట్ రైటర్లుగా నియమించుకున్నట్లు ఏసీబీ గుర్తించింది. వీరిద్దరూ డాక్యుమెంట్ రైటర్లతో కలిసి రిజిస్ట్రేషన్ల పేరుతో భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. కేవలం ఈ అనధికారిక రైటర్లు పంపిన పత్రాలను మాత్రమే వీరిద్దరు ప్రాధాన్యత ఇచ్చి రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తేలింది. కార్యాలయంలో పూర్తి కాని సుమారు 70 డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్లు, డాక్యుమెంట్ రైటర్ల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలు వాట్సాప్ చాట్ ద్వారా బట్టబయల య్యాయి. గత ఏడాది కాలంలోనే డాక్యుమెంట్ రైటర్ల ద్వారా ఈ ఇద్దరు అధికారులు సుమారు రూ. 42 లక్షలను లంచంగా తీసుకున్నట్లు ఏసీబీ ఆధారాలు సేకరించింది. కార్యాలయంలో సోదాల అనంతరం ఏసీబీ బృందాలు ఇద్దరి నివాసాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టాయి. వీరి ఇళ్లలో లక్షలాది రూపాయల నగదుతో పాటు భారీగా అక్రమ ఆస్తులకు సంబంధించిన పత్రాలను అధికారులు కనుగొన్నారు. ఇక్కడ ఓ షాకింగ్ అంశం వెలుగులోకి వచ్చింది. ఓ అధికారి ఇంట్లో రిజిస్ట్రేషన్ చేయని 254 ప్రభుత్వ పత్రాలు లభించడం అధికారులను సైతం విస్మయానికి గురిచేసింది. ప్రభుత్వ కార్యాలయంలో ఉండాల్సిన పత్రాలు అధికారుల ఇళ్లలో ఎందుకు ఉన్నాయనే కోణంలో ఏసీబీ దర్యాప్తు చేస్తోంది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఈ ఇద్దరు అధికారులపై ఏసీబీ కేసులు నమోదు చేసింది. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న నగదు, డాక్యుమెంట్లు, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తున్నారు.

# స్కూల్ ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

మొదటిపేజీ తరువాయి

ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఫీజులను పెంచుతున్నాయే తప్ప టీచర్లకు మాత్రం జీతాలు పెంచరని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీల్లో ఆహార నాణ్యతను ప్రభుత్వం పట్టించుకోదా అని ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాలలు, ఆసుపత్రులను సీఎం ప్రారంభిస్తున్నారని... వాళ్ళ దోపిడిని ఎంకరేజ్ చేస్తున్నారా అంటూ నిలదీశారు. ప్రైవేట్ స్కూల్స్ దోపిడీని కంట్రోల్ చేయాలని ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే స్కూల్స్ ముందు ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. 'అన్ని శాఖలకు ముఖ్యమంత్రే మంత్రిగా ఉండటం మన కర్మ' అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో తనను నిజామాబాద్‌కు పరిమితం చేశారని అన్నారు. ఆంధ్రా, నార్త్ ఇండియా వాళ్ళు ఇక్కడ విద్యా సంస్థలు నెలకొల్పినా తెలంగాణ వాళ్ళకే అవకాశం ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు.అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న స్కూల్ యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని.. అధిక ఫీజుల వసూళ్లను కట్టడి చేయాలని కోరారు.తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఫ్రీ అయిందని.. ఇప్పుడు దాన్ని ఎవరైనా వాడుకోవచ్చన్నారు. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి బిహార్ సిద్ధాంతకర్త అంటూ ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు.

# గిరిజనుల రిజర్వేషన్లు పెంచాం

మొదటిపేజీ తరువాయి

గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు.. ఒక్కరికీ ఇవ్వలేదు. పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యకు దూరం చేస్తున్నారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వేల కోట్లు ఇచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కూడా ఇవ్వడం లేదని ఆక్షేపించారు. సంత్ సేవాలాల్ కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు ప్రకటించి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఎస్టీల ఓట్లు కావాలిగానీ, వాళ్ల సంక్షేమం పట్టించుకోరా?అని ప్రశ్నించారు. కేరళలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తెలంగాణలో ఆరు గ్యారెంటీలను అమలు చేశామని బడాయి మాటలు చెబుతున్నారని విమర్శించారు.మా లంబాడీలను దగా చేశారు. సీఎం రేవంత్, ఆయన మనుమడు ఫుట్ బాల్ ఆడేందుకు డబ్బులు ఉంటాయి కానీ ఎస్టీలకు ఇచ్చేందుకు లేవా?. లగచర్లలో లంబాడీల భూములు గుంజుకుని సీఎం రేవంత్ రెడ్డి వారిని జైలులో పెట్టారు. ఇక్కడ చేసింది చాలదని కేరళకు పోయి గొప్పలు చెబుతున్నారు. ఇంట్లో ఈగల మోత అంటే కేరళపోయి పల్లకీల మోత అన్నట్లు ఉంది. కొడంగల్ నియోజకవర్గంలో ఏ గ్రామంలో రుణమాఫీ వంద శాతం జరిగిందో రేవంత్ చూపించాలని సవాల్ చేశారు. నేను కొడంగల్ వచ్చినా గ్రామసభల్లో మీ నాయకులను జనం నిలదీస్తున్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేశారు. ప్యాకేజ్–3లో కొంత పని మాత్రమే మిగిలి ఉంది. త్వరగా ఆ పని పూర్తి చేస్తే కేసీఆర్‌కు పేరొస్తుందని చేయల్లేదు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం. మీ నిర్లక్ష్యం వల్ల పాలమూరు ప్రజలకు అన్యాయం జరిగిందని అన్నారు.

# రాఘవచద్దాను తొలగిస్తూ ఆప్ నిర్ణయం

మొదటిపేజీ తరువాయి

ప్రజా సమస్యలనే లేవనెత్తుతా. బహుశా నేను ప్రస్తావించే అంశాలను సభలో సాధారణంగా చర్చించరేమో. కానీ, ప్రజా సమస్యలను ఎత్తిచూపడం ఏమైనా నేరమా అని నిలదీశారు. నేనేమైనా తప్పు చేశానా? పార్లమెంట్‌లో నాకు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని మా పార్టీ స్వయంగా రాజ్యసభ సెక్రటరీకి చెప్పింది. అందుకే ఈ రోజు నేను ఈ ప్రశ్నలు అడగాల్సి వచ్చింది. ఎయిర్‌పోర్టుల్లో ఆహార ధరలు, గిగ్ వర్కర్ల సమస్యలు, టోల్ ప్లాజా దోపిడీ, టెలికాం కంపెనీల రీఛార్జ్ విధానాల సమస్యలను లేవనెత్తితే.. అది ఆమ్‌ఆద్మీ పార్టీకే ప్రయోజనం కదా అని అన్నారు. మొన్నటికి మొన్న వివిధ రకాల పన్నులుపై నిలదీశారు. దీనివల్ల పార్టీకి ఏం నష్టం జరుగుతోంది? ఎందుకు నన్ను మాట్లాడకుండా అడ్డుకుంటున్నారు? ఇలాంటి చర్యలతో నా గళాన్ని మీరు అణచివేయగలరు. కాని, ఇది నా ఓటమి కాదు. ప్రజలు నా పక్షాన ఉన్నారు. వారికోసం ఎంత దూరమైనా వెళ్తా. నేను నది లాంటి వాడిని. సమయం వచ్చినప్పుడు వరదలా విరుచుకుపడతా అని రాఘవ్ చడ్డా తన వీడియోలో పేర్కొన్నారు. రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా రాఘవ్ చడ్డాను తొలగించిన ఆప్.. ఆ హోదాలో మరో ఎంపీ అశోక్ మిత్తల్‌ను నియమించింది. ఆప్ నిర్వహిస్తున్న కార్యకలాపాలకు చడ్డా దూరంగా ఉంటుండటం, పార్టీ కార్యక్రమాలపై స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రాఘవ్ చడ్డా భాజపాలో చేరనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తోన్న వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం తీవ్ర చర్చనీయాంశ మైంది.ఎంపి రాఘవ చద్దాని ఉపనాయకుడి పదవి నుంచి తొలగించాలని గురువారం రాజ్యసభ సచివాలయానికి ఆ పార్టీ లేఖ రాసింది. సభలో రాఘవ చద్దాని మాట్లాడనివ్వకూడదని కూడా ఆ లేఖలో ఆప్ పేర్కొంది. దీనిపై ఆప్ ఎంపి రాఘవ్‌చద్దా శుక్రవారం స్పందించారు. పార్లమెంటులో ప్రజా సమస్యలను లేవనెత్తడం నేరమా? నేను ఏదైనా తప్పు చేశానా? అని ఆప్‌ని ప్రశ్నించారు. ఈ మేరకు ఓ వీడియోను ఆయన శుక్రవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. నాకు ప్రజల మద్దతు ఉంది. నా మౌనాన్ని నా ఓటమిగా పొరపాటు పడకండి అని రాఘవ్ చద్దా వీడియోలో తెలిపారు.

## గ్రూప్-1 నియామకాలపై

# సుప్రీం తీర్పు..!

మొదటిపేజీ తరువాయి

ఇది ఉద్యోగ నియామకాల పట్ల తమ ప్రభుత్వ పారదర్శకతకు, చిత్తశుద్ధికి గుర్తింపుగా భావిస్తున్నామన్నారు. కొలువుల కోసం సంవత్సరాల తరబడి కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసి, కన్నవారి కష్టంపై ఆధారపడలేక, కొలువు వస్తుందో రాదో అన్న దిగులుతో పదేళ్లు కాలం వెళ్లదీసిన గ్రూప్ –1 ఆశావహులకు ఇది పెద్ద ఊరటగా చెప్పుకొచ్చారు. ప్రజా ప్రభుత్వం వచ్చీ రావడంతోనే నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలో నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ నియామకాలను అడ్డుకోవాలనుకున్న దుష్ట శక్తుల కుట్రలను కుతంత్రాలను ఛేదించి, రాష్ట్ర పునర్ నిర్మాణంలో తొలి గ్రూప్ –1 అధికారులుగా యువతను భాగస్వాములను చేశామని వెల్లడించారు. వారికి మరోసారి సీఎం అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వం ఆలోచనలు, సంకల్పానికి అనుగుణంగా టీజీపీఎస్సీ వ్యవస్థను ప్రక్షాళన చేసి, నిరుద్యోగ యువతకు వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించి, అత్యంత పారదర్శకంగా ఈ నియామకాలను పూర్తి చేసిన టీజీపీఎస్సీ ఛైర్మన్, ఉద్యోగులు, సిబ్బందికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ ట్వీట్ చేశారు.

## తెలంగాణలో ఏం చేశారని కేరళ

# ప్రచారం వెళ్లారు

మొదటిపేజీ తరువాయి

ఆరు గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిలో ఎన్ని నెరవేర్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఏం చేశారని, కేరళలో రేవంత్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ చేసిన తరహాలోనే రేవంత్‌రెడ్డి కూడా ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. బీసీలకు మేం అన్యాయం చేశామని అంటున్నారు.. బీసీలకు కాంగ్రెస్ ఏం చేసిందో రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసగించింది కాంగ్రెస్ పార్టీయేనని దుయ్యబట్టారు. ఆరు గ్యారంటీలు అమలు చేసినట్లు కేరళలో గొప్పలు పలుకుతున్న రేవంత్.. భవిష్యత్‌లో తెలంగాణలోనూ అదే తరహా మాటలు చెప్పే ప్రమాదముందని అన్నారు.

# కాంగ్రెస్‌పై రెండేళ్లలోనే ప్రజల్లో వ్యతిరేకత

## రేవంత్ రెడ్డి దిగిపోవాలని కోరుకుంటున్నారు

## మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల,ఏప్రిల్3(నేషనలిస్ట్ వాయిస్):

కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ రానున్న రోజుల్లో ఊహించలేని పరిస్థితి ఎదుర్కొంటుందని కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి జోస్యం చెప్పారు. తాను ఏ పార్టీలో చేరాలనేది కార్యకర్తల కోరిక మేరకే ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు విసుగొచ్చిన రాష్ట్ర ప్రజలు మార్పు రావాలి.. రేవంత్ రెడ్డి పోవాలనే ఆలోచన వచ్చిందన్నారు. జగిత్యాలలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజల సంక్షేమంతో పాటు ప్రాజెక్టుల నిర్వహణ ప్రధాన అంశమని తెలిపారు. తెలంగాణకు జీవనాడి ప్రాణహిత జలాలను వాడుకోవడంలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని ఆయన తెలిపారు. అభిమానుల ఆలోచనలకు అనుగుణంగా ఏ పార్టీలో చేరాలనేదానిపై నిర్ణయం తీసుకుంటానని జీవన్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్‌ను వీడిన తర్వాత జగిత్యాలలో తొలిసారిగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. ప్రాణహిత నదీ జలాలను వినియోగించుకోకపోవడం, పునరుద్ధరించకపోవడం రేవంత్ నిర్లక్ష్య పాలనకు నిదర్శనమని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన రెండేళ్లలోనే మార్పు రావాలనే పరిస్థితి వచ్చిందన్నారు. భాజపా, బీఆర్ఎస్ నాయకులకు తనపై ఉన్న అభిమానానికి జీవన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అయితే మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు సమాచారం. త్వరలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జగిత్యాలకు వెళ్లి జీవన్ రెడ్డిని ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 13న జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఆ రోజు మంచి ముహూర్తం ఉండటంతో గులాబీ కండువా కప్పుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నెల 6న అమెరికా నుంచి తిరిగి వచ్చిన వెంటనే కేటీఆర్.. జీవన్ రెడ్డిని కలిసి పార్టీలోకి ఆహ్వానించనున్నట్లు సమాచారం. జగిత్యాల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌ను బలోపేతం చేసేందుకు జీవన్ రెడ్డిని పార్టీలోకి తీసుకోవాలని కేటీఆర్ భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీకి, క్రియాశీల సభ్యత్వానికి జీవన్ రెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేసిన ఆయన.. నిత్యం జనంలోనే ఉంటూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జగిత్యాల ప్రాంతంలో బలమైన నేతగా ఉన్న జీవన్ రెడ్డి.. గులాబీ పార్టీలో చేరితే స్థానికంగా బీఆర్ఎస్‌కు మంచి ప్రయోజనం కలుగుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# సంపాదకీయం

## ట్రంప్‌కు జ్ఞానోదయం అయ్యేనా ?

పిల్లికి చెలగాటం..ఎలుకకు ప్రాణ సంకటం అన్న చందంగా ఇప్పుడు అమెరికా, ఇరాన్‌ల యుద్ధం తయారయ్యింది. ప్రపంచం అతలాకుతలం అవుతున్నా..ఇరాన్ కోలుకోలేకుండా చేయడమే లక్ష్యంగా ట్రంప్ మూర్ఖంగా ముందుకు సాగుతున్నారు. ట్రంపం ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదు. ఇంటాబయటా నిరసనలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇకముందు ప్రపంచంలో ఇంధన కొరత తీవ్ర రూపం దాల్చడం ఖాయంగా కనిపిస్తుంది. ఇంధన కొరత అన్ని దేశాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. దీనిగురించి ట్రంప్‌కు పెద్దగా బెంగ లేదు. ప్రజలు ఏమయితే ఏమిటన్న ధోరణిలో ఆయన యుద్ధాన్ని ప్రేరేపించారు. ప్రపంచంలో ఏ దేశంలో ఏమి జరిగినా అది మన ఇంట్లో పొయ్యిలో పిల్లి లేవాలా వద్దా అన్నంత ప్రభావం చూపుతోంది. ఇప్పటికే మనదేశంలో హోటల్ పరిశ్రమ కుదేలయ్యింది. ఇలాగే యుద్ధం కొనసాగితే దాని ప్రభావం ఎన్నాళ్లు ఉంటుందో చెప్పలేం.ఎందుకంటే యుద్ధం మొదలు పెట్టి ఇరాన్÷–ను దెబ్బతీసినందుకు గాను ఇరాన్ కూడా గట్టిగానే ఎదురిస్తోంది. అంతు చూస్తామని అమెరికాను హెచ్చరి స్తోంది. తమకు నాలుగు వేల కిలోమీటర్ల దూరంలోని డిగో గార్షియా మీద ఇరాన్ చేసిన దాడిని తక్కువగా అంచనా వేయటం తగదని అమెరికా పూర్వ అధ్యక్షుడు బిల్ క్లింటన్ ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్‌కు హితవు పలుకుతున్నాడంటే ఇక పైనైనా ఆచితూచి నిర్ణయం తీసుకోవాల్సిన ఆవశ్యకతను చెప్పడమే! అత్యంత అధునాతన ఎఫ్ 35 యుద్ధ విమానంపై ఇరాన్ దాడి చేసిందన్న వార్త ప్రపంచ దేశాలను ఉలికిపాటుకు గురిచేసింది. యుద్ధ తంత్ర నిపుణులు ఇరాన్ బలిమి లెక్కింపులో అమెరికా వ్యూహాన్ని తప్పుపట్టారు. తాజా వ్యూహంలో హర్మూజ్ జలసంధి ఇరాన్ పట్టు సడలించేందుకు ట్రంపు నానా యాతన పడుతున్నారు. అది సాధ్యం కావడం లేదు. ఇరాన్ తో సత్సంబంధాలు నెరపుతున్న భారత్ వంటి దేశాల నౌకలకే సేఫ్ ప్యాసేజ్ లభించింది. అయినా ప్రపంచవ్యాప్తంగా ఉన్న చమురు సంక్షోభంలో భారత్ కూడా చిక్కుకోక తప్పడంలేదు. కొన్ని నౌకలు భారతీయ పోర్టులకు చేరినా దేశవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల కొరత బ్లాక్ మార్కెట్, రవాణా వాహనాలు చార్జీలు పెంపు వంటి అంశాల నుంచి ఎప్పటికి సాధారణ స్థాయికి చేరుకుంటుందో చెప్పలేం. హర్మూజ్ జలసంధి ఇరాన్ పట్టు నుంచి తప్పించడానికి వెళ్తున్న యుద్ధ విమానాలకు శ్రీలంక అనుమతి నీయకపోవడంతో అమెరికా ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. హర్మూజ్ పై సైనిక చర్యకు ముందుకు రాని నాటో కూటమి దేశాలతో, తమ భద్రతను తామే ఏర్పాటు చేసుకోవాలని ట్రంప్ చేతులెత్తేశారు. ఆయన నిర్ణయాలకు మిత్ర దేశాల వత్తాసు లభించడం లేదు. ఇరాన్ వార్ కారణంగా ఖతార్ ఎల్ఎన్జి ఎగుమతులకు 5 ఏళ్ల పాటు దారి దొరికే పరిస్థితి లేదని తేలిపోయింది. ఇరాన్, అమెరికా ఇజ్రాయిల్ యుద్ధం మానవ రహిత కార్యాచరణగా సాగుతోంది. కేవలం ఆయా దేశాల మౌలిక వనరుల విచ్ఛిత్తి పైనే దాడిగా చెప్పుకోవాలి. నెల రోజులుగా జరుగుతున్న యుద్ధాన్ని విశ్లేషిస్తున్న వారెవరైనా ఈ యుద్ధం ఆగేందుకు దారి లేదని, ఆపేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని వారి వైఖరులే స్పష్టపరుస్తున్నాయి. తాజాగా ఇరాన్ అమెరికా ఉద్రిక్తతలు హిందూ మహా సముద్రానికి విస్తరించాయి. అమెరికా వ్యూహాత్మక సైనిక స్థావరం డిగో గారియాను ఇరాన్ లక్ష్యం చేసుకోవడంతో అమెరికాలో కలవరం బయలుదేరింది. ఇరాన్ వద్ద ఇలాంటి శక్తివం తమైన బాంబులున్నట్లు అంచనా వేయడంలో అమెరికా దాదాపు విఫలమైనట్లే. ఇప్పుడు అమెరికా ఆత్మరక్షణలో పడిపోయింది. అయినా ట్రంప్ తన అహంకారాన్ని వీడడం లేదు. యురేనియం శుద్ధి చేసే సామర్థ్యం ఇరాన్‌కు లేదని, అలాగే బాలిస్టిక్ క్షిపణులు తయారు చేసే సామర్థ్యం కూడా లేకుండా చేసి తాము విజయం సాధించినట్లేనని ఈ మధ్యనే ఇజ్రాయిల్ ప్రధాని బెంజి మెన్ నెతన్యాహు ఒక సందర్భంలో సంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్‌ను అణ్వస్త్ర తయారీ వరకు వెళ్లకుండా చేయడమే తమ అంతిమ లక్ష్య మని అమెరికా ఇజ్రాయిల్ ప్రకటించుకున్నాయి. అదే నిజమైతే ఇప్పుడు వాళ్ళు ఆ దిశగా విజయం సాధించినట్లే. ఇజ్రాయిల్ లక్ష్యం అదే అయినప్పుడు మరికొంత కాలం యుద్ధాన్ని సాగతీయడం ఉభయులకూ, ఈ ప్రపంచానికీ మంచిది కాదు. టెహ్రాన్‌పై అమెరికా– ఇజ్రాయిల్ సంయుక్తంగా చేపట్టిన యుద్ధం 34వ రోజుకు చేరుకుంది. ఇరుదేశాల పరస్పర దాడుల వల్ల పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఇస్లామిక్ రిపబ్లిక్‌పై అమెరికా జరిపే ఏ భూతల దాడినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాగేర్ గాలిబాఫ్ ప్రకటించారు. ఇందుకోసం 7 మిలియన్ల ఇరానీయులు సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. అమెరికాతో సంప్రదింపుల భాగస్వామిగా పేరు వినిపిస్తున్న మహమ్మద్ బఘేర్ ఖాలిబాఫ్, యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అమెరికాకు సవాలు విసురుతూ వరుసగా ఆన్‌లైన్ పోస్టులు పెడుతున్నారు. అమెరికా– ఇజ్రాయిల్ తమపై అకారణంగా దాడులు చేస్తున్నాయని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడుల కారణంగా దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను తిరిగి పునరుద్ధరించడానికి నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందుకోసం దేశవ్యాప్త కార్యక్రమం చేపట్టాలని నిర్దేశించారు. అమెరికా– ఇజ్రాయిల్ తమ దేశంపై కొనసాగిస్తోన్న నీచమైన, దురాక్రమణ దాడులను మొజ్తాబా తీవ్రంగా ఖండించారు. ఇరాన్ అభివద్ధిని విస్తరించడం, ఉజ్వల భవిష్యత్తుకు ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మొత్తంగా అమెరికాను ఎదిరించే సాహసం ఇరాన్ చేస్తోంది. ఇది అమెరికాకు ముఖ్యంగా ట్రంప్‌కు గుణపాఠం కావాలి.

# నేడు ప్రపంచ ఎలుకల దినోత్సవం




వినాయకుడి వాహనం. అయితేనేం.. ఇంట్లో అది చేసే అల్లరికి దాన్ని చూస్తేనే.. అంతెత్తున లేస్తారు. తిట్ల దండకం మొదలుపెడతారు. ఇక పిల్లి దాన్ని చూసిందంటే చాలు.. దాని అంతుచూసే దాకా వదలదు. మనుషులను ముప్పుతిప్పలు పెడుతున్నా.. 'మూషిక' మహారాజులను ప్రేమించే వారు , పూజించే వాళ్లు ఉన్నారు. ఇంతకీ ఏంటీ ఎలుక గోల అంటారా? ఈ రోజు ప్రపంచ ఎలుకల దినోత్సవం(వరల్డ్ ర్యాట్ డే)...ప్రపంచంలో ప్రతిరోజు ఏదో ఓ మూల.. ఓ దినోత్సవం జరుగుతూనే ఉంటుంది. కానీ అందులో కొన్ని మాత్రమే ప్రపంచవ్యాప్తంగా ఆకట్టుకుంటాయి. ఈ 'వరల్డ్ ర్యాట్ డే' ఇప్పుడిప్పుడే ఆదరణ పొందుతోంది.ఽజంతుప్రేమికులతో పాటు, ఎలుకలను అల్లారుముద్దుగా పెంచుకునే వాళ్లు ర్యాట్ డే ను ఏప్రిల్ 4న ఆనందంగా జరుపుకుంటున్నారు. ఎలుకల్లో అందంగా కనిపించే పప్పీ ర్యాట్స్‌కు ఎంతోమంది అభిమానులున్నారు. మనదేశంలో కాదు కానీ విదేశాల్లో వాటిని పెట్స్‌గా పెంచుకునే వాళ్ల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది.

### మూషిక పూజలు

రాజస్థాన్‌లోని దెష్నోక్‌లో ఉన్న కర్ణీమాత ఆలయంలో ఎలుకలను ప్రత్యేకంగా పూజిస్తారు. వాటికి ఇక్కడ మొక్కులు తీర్చడం విశేషం. ఈ గుడిలో ఎటు చూసినా వేలాది ఎలుకలు కనిపిస్తాయి. ఈ గుడికి వచ్చే భక్తులు వాటిని అమ్మవారి పిల్లలుగా భావించి ఎంతో భక్తితో పూజిస్తారు.

### ర్యాట్ డే ఇలా చేసుకుంటారు

ర్యాట్ లవర్స్.. తమ తమ పెంపుడు ఎలుకలను అందంగా ముస్తాబు చేస్తారు. వాటిని ఉంచే బోనులను కూడా అలంకరిస్తారు. ఎలుకలకు ఇష్టమైన ఆహారాన్ని ప్రిపేర్ చేస్తారు. ఇక ఎలుక ప్రేమికులంతా ఓ చోట కలుస్తారు. తమ ఎలుకలు చేసే అల్లరి గురించి ముచ్చటించుకుంటారు. కానుకలు ఇచ్చిపుచ్చుకుంటారు. సోషల్ వెబ్‌సైట్లో ర్యాట్ డే సెలబ్రేషన్స్ ఫొటోలను, అనుభూతులను తమ మిత్రులతో పంచుకుంటారు.

### పద ప్రయోగం

ఎలుక తోక తెచ్చి ఎన్నినాళ్లు ఉతికినా.. నలుపు నలుపే కానీ.. తెలుపు కాదు.

### సామెతలు

పిల్లికి ఎలుక సాక్ష్యమట
పిల్లి గుడ్డిదైతే.. ఎలుక ఎక్కిరించిదట.

### రక్షక ర్యాట్స్

వినాయకుడే కాదు.. తన వాహనమైన ఎలుక కూడా కాంబోడియా ప్రజల విఘ్నాలను తొలగిస్తుంది. కాంబోడియా నుంచి టాంజానియా వరకు అనేక చోట్ల మందుపాతర్లు ఉన్నాయి. కంబోడియన్ మైన్ యాక్షన్ సెంటర్ మందుపాతర్లను కనిపెట్టే పనిని మూషిక రాజుకు అప్పగించింది. ఈ రాక్షస ఎలుకలు(గెయింట్ ర్యాట్స్) వాసన చూసి మందుపాతర్లను కనిపెట్టడంలో దిట్ట. వీటికి తెలివి కూడా ఎక్కువే..టాంజానియాలోని అపొపొ అనే ఒక ఎన్‌జీవో సంస్థ వీటికి ప్రత్యేక శిక్షణ ఇస్తుంది. శిక్షణ తీసుకున్న ఎలుకల్ని మందుపాతర్లు ఉన్న ప్రదేశంలో విడిచి పెడతారు. ఆర్మర్ ధరించిన బాంబ్ స్క్వాడ్ దళాలు ఎలుకలకు పెద్ద తాడును బిగించి, వాటిని పట్టుకుని మందుపాతర్లను కనిపెట్టడానికి రంగంలోకి దిగుతాయి. ఎలుకలు మందుపాతరలు ఉన్న ప్రదేశాన్ని కనిపెట్టగానే కంబోడియన్ మైన్ యాక్షన్ సెంటర్ రంగంలోకి దిగి వాటిని నాశనం చేస్తుంది.

# నేడు జాతీయ విటమిన్ 'సి' దినోత్సవం

## -అన్ని విటమిన్స్ లో కెల్లా విటమిన్ సి కి విస్తృత గుర్తింపు




### జాతీయ విటమిన్ 'సి' దినోత్సవాన్ని

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 4వ తేదీన జరుపుకుంటారు. విటమిన్ సి మన ఆరోగ్యాన్ని లోపల మరియు వెలుపల చాలా రకాలుగా ప్రయోజనం చేకూరుస్తుంది.జలుబును నివారించడంలో విటమిన్ సి కి విస్తృత గుర్తింపు ఉన్నప్పటికీ, ఈ విటమిన్ ఆరోగ్యానికి సంబంధించిన ఇతర విషయాలలో కూడా ఎంతో శక్తివంతమైనదని వైద్యపరంగా నిరూపించబడింది. ఉదాహరణకు, విటమిన్ సి రక్తపోటును తగ్గించి, గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గించగలదు. గౌట్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉన్నవారు విటమిన్ సి ఎక్కువగా తీసుకోవడం ద్వారా ఆ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.పైపూతగా వాడినప్పుడు విటమిన్ సి ప్రతిరోజూ కాంతి, వేడి మరియు కాలుష్యానికి గురికావడం వల్ల కలిగే ఆక్సీకరణ నష్టం నుండి చర్మాన్ని రక్షించడం ద్వారా దానిని ఆరోగ్యంగా ఉంచుతుంది. చర్మంపై పూసే విటమిన్ సి ఉత్పత్తుల ప్రజాదరణ గణనీయంగా పెరిగింది.సరైన ఉత్పత్తితో, మీ సౌందర్య దినచర్యలో విటమిన్ సి ని చేర్చుకోవడం వల్ల మీ చర్మాన్ని కాంతివంతం చేయవచ్చు, వాపును తగ్గించవచ్చు, ఆరోగ్యకరమైన కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించవచ్చు. విటమిన్ సి దాదాపు ఏ ఆరోగ్య దినచర్యనైనా ప్రకాశవంతం చేస్తుంది..విటమిన్ సి యొక్క నిరూపిత ప్రయోజనాలను.జరుపుకోవడానికి స్కిన్‌స్యూటికల్స్ 2019లో జాతీయ విటమిన్ సి దినోత్సవాన్ని స్థాపించింది.స్కిన్‌స్యూటికల్స్ వ్యవస్థాపక శాస్త్రవేత్త అయిన డాక్టర్ షెల్డన్ పిన్నెల్ చేసిన పరిశోధన, చర్మానికి విటమిన్ సి యాంటీఆక్సిడెంట్లను సమర్థవంతంగా అందించడానికి పారామితులను నిర్ధారించింది, తద్వారా కాస్మోస్యూటికల్స్ ఆవిర్భావంలో స్కిన్‌స్యూటికల్స్ ముందంజ వేయడానికి వీలు కల్పించింది..జాతీయ దినోత్సవ క్యాలెండర్ రిజిస్ట్రార్ ఈ దినోత్సవాన్ని ఏటా ఏప్రిల్ 4వ తేదీన పాటించాలని ప్రకటించారు.


### విటమిన్ సి లోపం యొక్క సంకేతాలు

అభివృద్ధి చెందిన దేశాలలో ఈ లోపం అరుదుగా ఉన్నప్పటికీ, ముఖ్యంగా కఠినమైన ఆహార నియమాలు పాటించే లేదా పోషకాహార లోపం ఉన్న వ్యక్తులలో ఇది సంభవించవచ్చు. అలసట మరియు బలహీనత, పొడి, గరుకుగా లేదా గడ్డలుగడ్డలుగా ఉన్న చర్మం, చిగుళ్ల నుండి రక్తస్రావం మరియు తరచుగా గాయాలు కావడం, గాయం నెమ్మదిగా మానడం, కీళ్ల నొప్పి లాంటి లక్షణాలు ఉంటే మీకు తగినంత విటమిన్ సి అందడం లేదని అనుమానించవచ్చు. సి విటమిన్ లోపం అంచనా వేయడానికి ఆరోగ్య నిపుణుడిని సంప్రదించడం చాలా ముఖ్యం.

### తగినంత విటమిన్ సి ఎలా పొందాలి

శుభవార్త ఏమిటంటే, విటమిన్ సి అనేక రోజువారీ ఆహార పదార్థాలలో సులభంగా లభిస్తుంది. సప్లిమెంట్ల అవసరం లేకుండా, మీ రోజువారీ అవసరాలను తీర్చడానికి సాధారణంగా వైవిధ్యమైన, సమతుల్య ఆహారం సరిపోతుంది. సి విటమిన్ పొందేందుకు మనకు ఉత్తమ వనరులు ఉన్నాయి. ముఖ్యంగా నారింజ, నిమ్మకాయలు మరియు గ్రేపూట్ల వంటి సిట్రస్ పండ్లు,స్ట్రాబెర్రీలు, రాస్బ్బెర్రీలు, బ్లాకకరెంట్స్ వంటి బెర్రీలు,బెల్ పెప్పర్స్ (ముఖ్యంగా ఎరుపు మరియు పసుపు రకాలు), పాలకూర, కేల్ మరియు బ్రోకలీ వంటి ఆకు కూరలు,టమోటాలు, బొప్పాయిలు మరియు జామకాయలు పెద్దలకు సిఫార్సు చేయబడిన రోజువారీ మోతాదు 65 నుండి 90 మిల్లీగ్రాముల మధ్య ఉంటుంది, అయితే ఇది వయస్సు, జీవనశైలి మరియు ఆరోగ్య పరిస్థితులను బట్టి మారవచ్చు. ధూమపానం చేసేవారు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు లేదా శస్త్రచికిత్స నుండి కోలుకుంటున్న వారికి అధిక మోతాదులు అవసరం కావచ్చు. ఏది ఏమైనా వైద్యుడిని సంప్రదించి వారి సూచనల మేరకు నడుచుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# విజృంభిస్తున్న ఊపిరితిత్తుల క్యాన్సర్




ఊపిరితిత్తుల క్యాన్సర్ ధూమపానం, వాయు కాలుష్యం వల్ల వస్తుంది పొగ తాగడం ఆరోగ్యానికి హానికరం,ఇది క్యాన్సర్ కారకం అని బీడీ,సిగరెట్ చుట్టాల పెట్టెలపై ముద్రిస్తున్న,ఒక వైపు మన ప్రభుత్వాలు మరోవైపు సామాజిక మాధ్యమాలు, ఇతరాత్ర ప్రజల శ్రేయస్సు కోరే సామాజిక సేవా సంస్థలు గొంతెత్తి ఘోషిస్తున్న అవేవి లెక్క చేయకుండా ధూమపాన ప్రియులు దం మేరా దం అంటూ విచ్చలవిడిగా పొగ ఉదుతూ,దమ్ము మీద దమ్ము కొడుతూ అందులోనే మైమరచిపోయి ఊపిరితిత్తుల క్యాన్సర్ అనే అత్యంత అపాయకర వ్యాధి బారిన పడుతుండటం ఈ సమాజానికి సంబంధించి అత్యంత ఆందోళనకరమైన విషయం. అంతేకాదు ధూమపానంతో పాటు వాహనాలు, పరిశ్రమలు వెదజల్లే పొగ సైతం కాలుష్యంగా మారి ఎంతో అమూల్యమైన మనుషుల ప్రాణాలను సైతం కాటు వేస్తుండటం కడు శోచనీయమైన విషయం. మానవాళి ప్రాణాలను వున్న ఫలంగా హరించి వేస్తున్న ఈ ఊపిరితిత్తుల క్యాన్సర్ ను ఎలాగైనా కట్టడి చేయాలనే,ఆ మహమ్మారికి అడ్డుకట్ట వేయాలనే ఏకైక ఆశయం,లక్ష్యంతో మన ప్రభుత్వాలు ప్రపంచ వ్యాప్తంగా ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవాన్ని సైతం నిర్వహిస్తు ఈ ధూమపానం,వాయు కాలుష్యానికి దూరంగా ఉండాలని ప్రజలకు ఒక అవగాహనతో కూడిన సామాజిక సందేశాన్ని ఇచ్చేందుకు నడుం బిగించడం ఎంతైనా హర్షణీయం.ఇక ధూమపానం అనే ఈ దురలవాటును నేటి యువత ఏదో సరదాగా మొదలుపెట్టి ఈ పొగతాగడానికి క్రమ క్రమంగా అలవాటుపడిన అంతిమంగా దానికి బానిస అయి ఈ ఊపిరితిత్తుల క్యాన్సర్ అనే అపాయకరమైన వ్యాధి బారినపడి ఇటు ఆరోగ్యాన్ని సర్వనాశనం చేసుకోవడంతో పాటు,అటు ఆర్థికంగా నష్టపోతున్నారు అనే మాట సత్యదూరం కాదు. అదేమాదిరి ధూమపానం చేసేవారిలో చేయనివారి కంటే ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం 24 నుంచి 35 రేట్లు ఎక్కువగా ఉంటుందని,అలాగే పొగ త్రాగేవారు పీల్చడం, (పాసివ్ స్మోకింగ్ ) ద్వారా 3.5 శాతం క్యాన్సర్ బారినపడుతున్నారని వైద్యులు సెల విస్తుండటాన్ని ప్రతి ఒక్క ప్రజానీకం ఆలోచించాల్సిన విషయం.అన్నింటికి మించి ఊపిరితిత్తుల క్యాన్సర్ రకాల విషయానికి వస్తే స్మాల్ సెల్ లంగ్ క్యాన్సర్ ఇది చిన్న కణాల ఊపిరితిత్తుల క్యాన్సర్.ఇది దాదాపుగా ధూమపానం చేసేవారిలో ఎక్కువగా సంభవించడం, అలాగే నాన్ స్మాల్ సెల్ క్యాన్సర్ లు సైతం ఉంటాయి. ( క్యామాసెల్ క్యాన్సర్, అడెనోకార్సినోమా, పెద్ద కణాల క్యాన్సర్)!ఏదిఏమైన నిరంతరం దగ్గు,దగ్గినప్పుడు రక్తం పడటం,శ్వాస ఆడకపోవడం,ఛాతిలో నొప్పి,బరువు తగ్గిపోవడం, ఎముకల నొప్పి,తలనొప్పి, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు కనపడినప్పుడు అది ఖచ్చితంగా ఊపిరితిత్తుల క్యాన్సర్ అని నిర్ధారణ చేసుకొని తక్షణమే వైద్యులను సంప్రదించి చికిత్సను తీసుకుంటే వారు మనల్ని రక్షించేందుకు,ప్రాణ బిక్ష పెట్టేందుకు వారి శాయశక్తుల కృషిసల్పుతారు అనే మాట అక్షర సత్యం.అంతేకాకుండా ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధి ముదిరి పాకాన పడిన తరువాత వైద్యులను సంప్రదిస్తే ' చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్న ' చందన అంతిమంగా మన ప్రాణాలకే ముప్పు వాటిల్లవచ్చు.ఏమైనా ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశం వున్నవారు ఏడాదికి ఒకసారి అవసరమైన పరీక్షలు చేయించుకొని,లక్షణాలను బట్టి వైద్యుల సూచనల మేరకు చాతి ఎక్స్ రే,ఛాతి సీటీ స్కాన్,కఫం సైటోలజీ పరీక్షలు చేయించుకోవడంతో పాటు,క్యాన్సర్ రకాన్ని గుర్తించేందుకు టిష్యూ బయాప్సీ అవసరం ఎంతైనా వుంది.ఇక ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధి బయట పడిన తరువాత కీమోథెరపి,రేడియోథెరపి విధానాల్లో వైద్యులు చికిత్స అందిస్తూ ఊపిరితిత్తుల వ్యాధిన బారిన పడి అలమటిస్తున్న వారిని ఎలాగైనా కాపాడేందుకు వారు తమ వైద్య పరిజ్ఞానాన్ని అంతా దారపోస్తుంటారు. అందుకే మనమంతా వైద్యో : నారాయణో హరి అని డాక్టర్ లను మనం మనుషుల ప్రాణాలకు ఆయుష్షుపోసి మరీ నిలబెట్టే దేవుళ్లుగా వెయ్యినోళ్లుగా వారిని కొని యాడుతుంటాము, కీర్తిస్తుంటాము.ధూమపానం, వాయు కాలుష్యానికి దూరంగా ఉండి మన విలువైన ప్రాణాలను మరో పది కాలాల పాటు కాపాడుకుందాం! ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడికి పెద్ద పీట వేద్దాం ఆరోగ్య సమాజాన్ని స్థాపిద్దాం

# అంగరంగ వైభవంగా సీతారాముల రథోత్సవం

## -భక్తి పారవశ్యంలో మునిగి తేలిన ప్రజలు-స్వామి వారికి చక్రతీర్థ స్నానం

**తూప్రాన్, ఏప్రిల్ 3. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

తూప్రాన్ పట్టణం భక్తి, సంప్రదాయం, రాజకీయ ఉత్కంఠల మధ్య అరుదైన దృశ్యానికి వేదికైంది. శతాబ్దాలుగా కొనసాగుతున్న సీతారాముల బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే రథోత్సవం ఈసారి మరింత వైభవంగా, కానీ రాజకీయ కల్లోలాల నడుమ జరిగింది. భక్తి పరవశంలో రథోత్సవ వైభవంశుక్రవారం ఉదయం జరగాల్సిన రథోత్సవం ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ, భక్తుల ఉత్సాహం మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ఆలయ ప్రాంగణం "జై శ్రీరామ్ -- జై జై శ్రీరామ్" నినాదాలతో మార్మోగింది. విమాన రథం పుష్పాలతో అలంకరించి, సీతా రామచంద్ర స్వామివారిని అద్భుతంగా శోభాయ మానంగా అలంకరించి ఊరేగించారు. యజ్ఞాలు, యాగాలు, ప్రత్యేక పూజల అనంతరం రథ చక్రాలు కదిలిన క్షణం భక్తుల కళ్లలో ఆనందబాష్పాలు మెరిశాయి. పెద్దలు, పిల్లలు, మహిళలు---అందరూ భక్తి పారవశ్యంలో రథాన్ని లాగుతూ ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. రాజకీయ రంగు పులుముకున్న ఆధ్యాత్మిక వేదికఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న ఆనవాయితీకి విఘాతం కలిగించేలా ఈసారి రాజకీయ జోక్యం తీవ్ర చర్చనీయాంశమైంది. ఉదయం 7:30 గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యక్రమం రాజకీయ ఒత్తిళ్లతో వాయిదా పడింది. అధికార పార్టీ నేతల జోక్యం నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ తదితర ప్రజాప్రతినిధులను పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం పరిస్థితిని ఉద్రిక్తంగా మార్చింది. ఈ చర్యలపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "దేవాలయాల్లో రాజకీయాలు ఎందుకు?" "ఆనవాయితీ కాపాడాలి"అంటూ గట్టిగా నినదించారు. భారీ భద్రత -- ఉద్రిక్త వాతావరణంతూప్రాన్ పోలీస్ డివిజన్ పరిధిలోని 12 స్టేషన్ల నుంచి పోలీసులు, స్పెషల్ ఫోర్స్ కలిపి భారీ భద్రతను ఏర్పాటు చేశారు. దాదాపు 95 మంది పోలీసులు, ముగ్గురు సి. ఐలు, ఉన్నతాధికారులు అక్కడ మోహరించారు. ఒక దశలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. డీఎస్పీ జోక్యం -- భక్తుల విజయంఈ ఉద్రిక్త పరిస్థితుల్లో డీఎస్పీ నరేందర్ గౌడ్ సమయోచితంగా జోక్యం చేసుకున్నారు. భక్తులతో మాట్లాడి పూర్వపు సంప్రదాయాల ప్రకారం రథోత్సవం నిర్వహించేందుకు ఒప్పించారు. తరువాత హౌస్ అరెస్ట్‌లో ఉన్న చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్‌ను ఆలయానికి రప్పించి కార్యక్రమాన్ని పునఃప్రారంభించారు. ఈ పరిణామంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఆలస్యంగా అయినా రథోత్సవం ఘనంగా కొనసాగింది. సంప్రదాయం గెలిచింది -- భక్తి విజయంచివరకు యథావిధిగా రథోత్సవం నిర్వహించి, స్వామివారికి చక్రస్నానం చేసి ప్రత్యేక అలంకరణలతో ఊరేగించారు. రాజకీయ ఉద్రిక్తతల మధ్య కూడా భక్తి గెలిచింది. సంప్రదాయం నిలిచింది. ఈ ఘటన తూప్రాన్ ప్రజలకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది దేవాలయాలు భక్తికి నిలయాలు... రాజకీయాలకు కాదు. ఎన్ని అడ్డంకులు వచ్చినా, భక్తుల ఐక్యత ముందు అవన్నీ చెరిగిపోతాయని ఈ రథోత్సవం మరోసారి నిరూపించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బొంది రజినీ రవీందర్ గౌడ్, వైస్ చైర్మన్ కొక్కొండ సమతా కాశిరెడ్డి, కౌన్సిలర్ లు చెలిమెల రాములు, జైపాల్ రాథోడ్ నాయక్, బైరం సత్యలింగం, రాధా శ్రీనివాస్, మునిరాతి లక్ష్మీ, ఐలేని యాదవ్, ఆర్య వైశ్యసంఘం అధ్యక్షులు కోవూరు శ్రీనివాస్ గుప్త, నాయకులు జంగం యాదగిరి కుక్కల మల్లయ్య, బాధే వాసుదేవ్, రేపల్లె శంకర్, తలారి మల్లేష్, తలారి బీమరి సత్తయ్య, స్వర్గం వెంకట నారాయణ, తదితరులు పాల్గొన్నారు.











# జనగణన పనులు సమగ్రంగా చేపట్టాలి

## భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 3(నేషనలిస్ట్ వాయిస్):**

జిల్లాలో జాతీయ జనగణన కార్యక్రమాన్ని సమగ్రంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరించే విధానాన్ని ప్రదర్శించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన ప్రక్రియలో ప్రతి ఇంటిని కవర్ చేస్తూ ఎలాంటి లోపాలు లేకుండా ఖచ్చితమైన డేటా సేకరణ జరగాలని ఆయన అన్నారు. జనగణనలో సేకరించే సమాచారం ప్రభుత్వ విధానాల రూపకల్పనకు ఎంతో కీలకమని అన్నారు. అందువల్ల ప్రతి వివరాన్ని శ్రద్ధగా నమోదు చేయాలని ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారికి అవసరమైన సమాచారం అందిస్తూ డేటా సేకరణ చేపట్టాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా జాతీయ జనగణన కార్యక్రమం భాగంగా జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో ఫీల్డ్ ట్రైనర్స్‌కు మూడు రోజులపాటు శిక్షణా తరగతుల నిర్వహించారు. ఫీల్డ్ స్థాయిలో పని చేసే సిబ్బందికి అవసరమైన అన్ని అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో మాస్టర్ ట్రైనర్స్‌గా ఎన్. శివరామకృష్ణ, డాక్టర్ పి.సుస్మిత రజిని పాల్గొని మొత్తం 34 మంది ఫీల్డ్ ట్రైనీస్‌కు జనగణన నిర్వహణ విధానం హౌస్ సెన్సెస్ డేటా సేకరణలో పాటించాల్సిన జాగ్రత్తలు డిజిటల్ పద్ధతుల వినియోగం తదితర అంశాలపై విపులంగా శిక్షణ అందించారు. శిక్షణలో భాగంగా మూడవ రోజు పాలకోయ తండా ప్రాంతంలో ప్రాక్టికల్ డెమో నిర్వహించారు. ఫీల్డ్ ట్రైనీస్‌ను అవుట్ ఫీల్డ్‌కు తీసుకెళ్లి ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరించే విధానాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మొదటి ఇంటిలో హౌస్ సెన్సెస్ కార్యక్రమాన్ని కలెక్టర్ అంకిత్ సమక్షంలో నిర్వహించారు. ఈ డెమో ద్వారా ఫీల్డ్ ట్రైనీస్‌కు ప్రత్యక్ష అనుభవం లభించింది. ఈ కార్యక్రమంలో సెన్సెస్ జిల్లా అధికార సిబ్బంది సి.పి.ఓ. సంజీవరావు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# రామవరంకు నీళ్లు ఇవ్వడంలో సింగరేణి నిర్లక్ష్యం

## -రామవరం ప్రాంతానికి మాత్రమే ఫిల్టర్ బెడ్ నీళ్లు అందించాలి-ఫిల్టర్ బెడ్ చుట్టూ శుభ్రత చూడాలి

## -పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలి -సిపిఐ నాయకుల డిమాండ్




**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 3(నేషనలిస్ట్ వాయిస్):**

సింగరేణి యాజమాన్యం రామవరం ప్రజలకు మంచినీళ్లను అందించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని దీనికి రామవరం ప్రాంతంలో కార్మికుల సంఖ్య తగ్గటమే కారణమా అని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు, 17వ డివిజన్ కార్పొరేటర్ ఎర్రబెల్లి శంకర్ లు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సింగరేణి ఫిల్టర్ బెడ్ ను సందర్శించి వారు మాట్లాడుతూ సింగరేణి ప్రభావిత ప్రాంతంగా ఉన్న రామవరం పట్ల యాజమాన్యం నిర్లక్ష్యం చూపుతుందని ఆరోపించారు. ఈ ఫిల్టర్ బెడ్ నుండి త్రీ ఇంక్లైన్ కు నీళ్లు అందించకుండా రామవరం ప్రజలకు మాత్రమే మంచినీళ్లు అందించాలని వారు డిమాండ్ చేశారు. రామవరం 30 వేల జనాభాతో విస్తరించి ఉందని, సింగరేణి తలమానుకమైన రామవరం ప్రజలకు మంచినీళ్లు అందించడంలో సింగరేణి యాజమాన్యం వైఫల్యం చెందుతుందని వారు విమర్శించారు. కార్మికుల సంఖ్య లేదని కారణం చూపుతున్నారో, లేక ఇటు వచ్చే నీళ్లను కొత్త ఓపెన్ కాస్ట్ నిర్మాణం అవసరాలకు స్టోరేజ్ చేస్తున్నారో అర్థం కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్రీ ఇంక్లైన్ ప్రాంతానికి రామవరం ప్రాంతానికి కలిపి ఒక ఫిల్టర్ బెడ్ ద్వారా నీళ్లు అందించడం వల్ల రామవరం ప్రాంత ప్రజలకు మంచినీళ్ల కష్టం తప్పటం లేదని అన్నారు.

గత సెవెన్ ఇంక్లైన్ నుండి నిర్వాసితులుగా వచ్చిన ఇందిరమ్మ కాలనీ నాగయ్య గడ్డ, నేతాజీ బస్తి లక్ష్మీ, టాకీస్ ఏరియా, నెహ్రూ బస్తి, బర్మా క్యాంప్ తదితర ఏరియాలో ఎప్పుడో చేసిన పైపులైన్ కారణంగా టి జాయింట్ల వద్ద ఇసుక ఇరుక్కుపోయి కూడా మంచినీళ్లు అందటం లేదని తక్షణమే ఆయా టీ జాయింట్ల వద్ద తవ్వకాలు చేపట్టి పైప్లైన్ లో ఇరుక్కుపోయిన చెత్తాచెదాలను తొలగించి రామవరం ప్రాంత ప్రజల మంచినీటి కష్టాలు తీర్చాలని వారు సింగరేణి యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. అలాగే స్టాండ్ బై మోటార్లను ఏర్పాటు చేసుకోవాలని శిథిలమైన ఫిల్టర్ బెడ్డు ఒక భాగాన్ని నిర్మాణం చేసి దాన్ని ఉపయోగంలోకి తేవాలని కోరారు. నీటిపై నాసు లేకుండా చూడాలని, వేసవిని దృష్టిలో పెట్టుకొని ఎలాంటి అవాంతరం లేకుండా నిరంతరం మంచినీళు అందించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ ఫిల్టర్ బెడ్ ను సందర్శించిన వారిలో సిపిఐ నాయకులు గట్టు చంద్రశేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య పాఠశాల-2లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**తూప్రాన్, ఏప్రిల్, 3. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

తూప్రాన్ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల-2లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఐదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆరో తరగతిలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో కొంపల్లి జోన్-ూా+వీ రమణారావు, జోనల్ కోఆర్డినేటర్ రవి, అసిస్టెంట్ కోఆర్డినేటర్ సోమేశ్, ప్రైమరీ కోఆర్డినేటర్ లావణ్య పాల్గొని విద్యార్థులను అభినందించి ఆశీర్వదించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత విద్యలో కూడా ఇదే క్రమశిక్షణతో ముందుకు సాగి, మంచి ప్రతిభ కనబరచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం పాల్గొని చిన్నారులను ప్రోత్స హించారు. కార్యక్రమం ఆనందోత్సాహ వాతావరణంలో సాగింది.




# రహదారి పక్కన ట్రాన్స్‌ఫార్మర్లు... జాగ్రత్తలు ఎక్కడ?..

**ఏర్గట్ల ఏప్రిల్ 3(నేషనలిస్ట్ వాయిస్):**


నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలంలోని తల్లా రాంపూర్ నుంచి దొంచందా వెళ్లే రహదారిలో రోడ్డుకు పక్కన ట్రాన్స్‌ఫార్మర్లు రక్షణ కంచెలు లేకుండా ఉండటం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. రహదారికి అతి సమీపంలోనే ఈ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయబడటం వల్ల భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశముందని ప్రజలు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, ట్రాన్స్‌ఫార్మర్లకు తక్షణం రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు




# కార్యకర్తల కష్టాల్లో అండగా నిలిచిన ప్రశాంత్ రెడ్డి...

**ఏర్గట్ల ఏప్రిల్ 3(నేషనలిస్ట్ వాయిస్):**

బాల్కొండ నియోజకవర్గంలోని ఏర్గట్ల మండల కేంద్రంలో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పర్యటించి పలువురు కార్యకర్తలు, పరామర్శించారు. మండలంలోని ఏర్గట్ల గ్రామానికి చెందిన దేవుడు నర్సయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనను ఎమ్మెల్యే వ్యక్తిగతంగా కలిసి పరామర్శించారు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అలాగే, నిమ్మన గంగయ్య వల్ల తల్లి స్వర్గస్తులైన కారణంగా వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి,కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పాడు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజా పూర్ణనందం, సర్పంచ్ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, బర్మా చిన్న నర్సయ్య, డా,,మధు, గడ్డం మోహన్, రొక్కెడ మోహన్, ఏలేటి బాలకిషన్, గడ్డం రమేష్, సంగేమ్ ఆనంద్, జక్కుల పెద్ద భూమయ్య, బద్దం ప్రభాకర్, రాజేశ్వర్ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కాంపౌండ్ వాల్ కు భూమి పూజ...

**ఏప్రిల్ 3(నేషనలిస్ట్ వాయిస్):**

నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం జానకం పేట్ గ్రామంలో 5 లక్షల ఎమ్మెల్యే సిడిపి నిధులు, మరియు 5 లక్షలు ఎంపీ నిధులతో చేపట్టబోయే వెంకటేశ్వర స్వామి ఆలయం కాంపౌండ్ వాల్ పనులు ప్రారంభించి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# నాళాలు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు.









## రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి.

**నేషనలిస్ట్ వాయిస్, గోదావరిఖని :**

రామగుండం కార్పొరేషన్ పరిధిలో నాలా లు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేస్తే ఊరుకునేది లేదని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి గారు హెచ్చరించారు. హెచ్చరించడమే కాకుండా 35 వ డివిజన్ వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఐ బి కాలనీ లో పర్యటించిన ఆయన ప్రదాన కాలువ కల్వర్ట్ ప్రక్కన అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని జె సి బి యంత్రం తో కూల్చివేయించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ నాలాలలో పూడిక తీత కార్యక్రమం నిరంతరంగా కొనసాగడానికి బఫర్ జోన్ అవసరమని అన్నారు. బఫర్ జోన్ ఆక్రమించి కట్టుకుంటే కూల్చివేయక తప్పదని అన్నారు. బఫర్ జోన్ లో సానిటేషన్ ట్రాక్టర్ వెళ్ళడానికి వీలుగా సి సి రోడ్డు కూడా నిర్మిస్తామని అన్నారు. గతంలో కాలువల్లో పూడిక తీత అంటే లక్షల రూపాయలు వెచ్చించి టెండర్ పిలిచి తూతూ మంత్రంగా పనులు చేసేవారని ప్రస్తుతం నగర పాలక సంస్థ పై ఆర్థిక భారం పడకుండా మున్సిపల్ యంత్రాలతో , మున్సిపల్ సిబ్బందితోనే పని చేయిస్తున్నామని అన్నారు. కాలువల్లో చెత్త వేయకుండా మునిసిపల్ వాహనానికి ఇవ్వాలని చేతులు జోడించి వేడుకుంటున్నానని అన్నారు. కాలువల్లో చెత్త వేయడం వలన పరిశుభ్రం చేయడానికి డబ్బు వృధా కావడంతో పాటు మురుగు నీరు సాఫీ గా పర్వహించకుండా నిలిచిపోయి దుర్వాసన , దోమలతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ జంగపెల్లి రమాదేవి శ్రీనివాస్ తో పాటు పలువురు కార్పొరేటర్లు కంకణాల మౌనిక రాజు , వడ్లూరి రవి, దాసరి సాంబమూర్తి, ధూళి కట్ట సతీష్ పలువురు నాయకులు వేగోలపు శ్రీనివాస్ , పీచర శ్రీనివాస రావు , కాలనీ వాసులు శ్రమదానం చేశారు. పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి కాలువ ప్రక్కన పెరిగిన పిచ్చి చెట్లు , తుప్పలను తొలగించే పనిలో పాలు పంచుకున్నారు. నగర పాలక సంస్థ అధికారులు కూడా చేయి కలిపారు దీంతో ఐ బి కాలనీ కల్వర్ట్ కు ఇరువైపులా పొదలు తొలగిపోయి శుభ్ర పడడంతో పాటు పారిశుద్ధ్య సిబ్బంది , యంత్రాలు కాలువ లో సులువుగా పూడిక తొలగించడానికి అనుకూలంగా మార్గం ఏర్పడింది. శ్రమ దానంలో పంచుకున్న అందరినీ మేయర్ అభినందించారు. ఐ బి కాలనీ ప్రవేశంలో మూలన పేరుకుపోయిన శిధిలాలు చెత్త ను తొలగించారు. నీటి సరఫరా వాల్వ్ కోసం తవ్విన గుంతలపై ప్రమాదాలు జరగకుండా మూతలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదుటనే చెత్త ఉండడం గమనించి శుభ్రం చేయడానికి చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీస్ అధికారులకు సూచించారు. కాలనీ ప్రవేశం లోనే మూల మలుపు వద్ద వృధా గా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని ఆదేశించారు. మెడికల్ కళాశాల రోడ్డులో చైన్ జె సి బి యంత్రంతో పూడిక తీయడంతో మురుగు నీరు సాఫీగా ప్రవహిస్తున్నది. పూర్తి స్థాయిలో పని పవర్తయ్యేంతవరకు కొనసాగించాలని మేయర్ సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అధికారులు డి .ఇ.షాభాజ్ , ఎ ఇ మీర్ , టి పి ఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ , టి పి బి ఓ శ్రావణ్ , ఎలెక్ట్రికల్ ఎ ఇ రాంజీ , సానిటరి ఇన్స్పెక్టర్ నాగ భూషణం , జవాన్ బండారి రవి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి.





**కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 3.**

ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి అని కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ అన్నారు..ఆపిల్ కిడ్స్ 13వ వార్షికోత్సవ వేడుకలు స్థానిక మండల కేంద్రంలో గల ఆపిల్ కిడ్స్ పాఠశాలలో ఘనముగా 13వ వార్షికోత్సవం మరియు యూకేజీ విద్యార్థులకు పాఠశాలలో జరుపు కోవడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమాన్పూర్ గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ మరియు పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు ఏ కేశవరెడ్డి మరియు మీ ఓదేలు యాదవ్ యూట్యూబ్ స్టార్ మరియు జబర్దస్త్ ఫేమ్ వర్మిని వర్షిని ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసి విద్యార్థులను మరియు పోషకులను ఎంతగానో ఉత్సాహపరిచారు పెద్దపెల్లి జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు మచ్చ రాము ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థి విద్యార్థులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని వారు కొనియాడారు అనంతరం వారికి బహుమతులను అందించారు విద్యార్థులు సెల్ఫోన్ వాడకం తగ్గించాలని తల్లిదండ్రులు వారికి ఇంటి వద్ద సెల్ ఫోన్స్ ఇవ్వ కుండా చూసినటువంటి బాధ్యత తల్లిదండ్రుల దే వారు తెలియజేశారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల కరస్పాండెంట్ చదువు వెంకటరెడ్డి మాట్లాడుతూ రాబోవు రోజుల్లో కమాన్పూర్ మండల కేంద్రంలో పోషకుల సహకారంతో మంచి విద్యను విద్యార్థి విద్యార్థులకు అందిస్తామని హామీ ఇచ్చారు అదేవిధంగా పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఎంతగానో విద్యార్థులకు మంచి విద్యను బోధించడంలో ఎంతగానో కృషి చేస్తున్నారని సిబిఎస్ సలహాలు విద్యాబోధనను విద్యార్థులకు అందించడం జరుగుతుందని వారు తెలియపరిచారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఏ నాయకులు కిషన్ రెడ్డి బిజెపి నాయకులు జంగంపల్లి అజయ్ 8 వ వార్డు నెంబర్ మెడగొని సత్యవతి శ్రీనివాస్ ప్రిన్సిపాల్ రాజమణి భూలక్ష్మి గౌతమి ప్రియాంక నాగరాణి చామంతి సుమ రజిత అధిక సంఖ్యలో పోషకులు పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు

# మరోమారు నోరు పారేసుకున్న ఖవాజా

## భారత్ దాడులు చేస్తే బుద్ది చెబుతామని హెచ్చరిక

**ఇస్లామాబాద్,ఏప్రిల్3( నేషనలిస్ట్ వాయిస్):**

పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. పహల్గాం దాడి జరిగి ఏడాది కావస్తున్న నేపథ్యంలో భారత్ తమపై బెదిరింపులకు పాల్పడు తోందని ఆరోపించారు. ఇవన్నీ చూస్తుంటే వారు తమపై దాడులకు ప్రణాళికలు రచిస్తూ..రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు అనిపిస్తోందన్నారు. మరోసారి తమతో ఘర్షణకు దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తమపై జరిగే దాడులను వేగవంతమైన, ప్రణాళికాబద్ధమైన ప్రతిస్పందనతో తిప్పికొడతామన్నారు. ఇరాన్ యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని పొరుగుదేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇటీవల కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ పాక్‌ను హెచ్చరించారు. ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్‌లను గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఖవాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# రేచిని గ్రామంలో ఉచిత ఆంటీ-రేబీస్ టీకాలు

**నేషనలిస్ట్ వాయిస్;తాండూర్**

రేచిని గ్రామ పంచాయతీ పరిధిలోని మంగలి వార్డు మరియు కుమ్మరి వార్డుల్లో ఈరోజు ఉచిత ఆంటీ–రేబీస్ వ్యాధి నివారణ టీకాలు నిర్వహించబడినట్లు పశువైద్య అధికారి శివ ప్రసాద్ తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో ఈ కార్యక్రమం సజావుగా సాగిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా శివ ప్రసాద్ మాట్లాడుతూ, రేబీస్ ఒక ప్రమాదకరమైన వ్యాధి కావడంతో ప్రతి ఒక్కరూ తమ పెంపుడు జంతువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా కుక్కలు మరియు ఇతర జంతువుల ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సాయి, కళ్యాణ్ పాల్గొని టీకాలు వేశారు. గ్రామస్థులు మంచి స్పందన చూపి తమ పెంపుడు జంతువులకు టీకాలు వేయించుకున్నారని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శివ ప్రసాద్ కోరారు.



# గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యం

**పెద్దపల్లి ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్:**

మండలంలోని ముత్తారం గ్రామ శివారులో గల డి 83 కెనాల్ లో ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి శవం పడి ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిపారు. ఈ మృతదేహాన్ని కెనాల్ నుండి బయటకు తీసి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురి గదిలో భద్ర పరి చినట్లు వారు పేర్కొన్నా రు. కాగా శవంపై నలుపు రంగు రౌండ్ నెక్ టీషర్టు, కుడి చేయికి గోల్డ్ రంగులు బ్రాస్లెట్ కలిగి ఉన్నాడని, ఎవరైనా ఆనవాళ్లు గుర్తించి నట్లయితే ఈ క్రింది సెల్ నెంబర్లు 8712 656507. 8712659486. 949195 0993 కు సమాచారం ఇవ్వాలని వారు కోరారు.



# ప్రజాపాలన పేరుతో ప్రభుత్వ నిధుల దుర్వినియోగం..

## సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి దండిగారి సతీష్.

**జమ్మికుంట, నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 3..**

ప్రజాపాలన పేరుతో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేయడం తప్పితే ప్రజలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించడం లేదని సిపిఎం పార్టీ జమ్మికుంట పట్టణ కార్యదర్శి దండిగారి సతీష్ ఆరోపించారులి జమ్మికుంట పట్టణానికి సంబంధించిన 30 వార్డులో పారదర్శకంగా వార్డు సభలు నిర్వహించలేదని మొక్కుబడి కార్యక్రమంగా నిర్వహించారని పట్టణంలోని అనేక సమస్యలు పేరుకుపోయి ఉన్నాయని, ఏయే వార్డులలో ఏ సమస్యలు ఉన్నాయో ఈ వార్డు సభల సందర్భంగా గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ఆ వార్డులో ఉన్న ప్రజలను భాగస్వామ్యం చేయాలని అలా కాకుండా 99 రోజుల ప్రణాళిక అంటూ మొక్కుబడి కార్యక్రమంగా ఒకే పార్టీకి సంబంధించిన కార్యకర్తలు లేదా ఆయా కౌన్సిలర్ల కనుసన్నాలలో మాత్రమే వార్డు సభలు నిర్వహించారు తప్పితే,ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకున్నటువంటి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ఆ పార్టీకి సంబంధించిన మున్సిపల్ చైర్మన్ కానీ, కౌన్సిలర్లు కానీ అంతగా పట్టింపు లేనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ సమస్యలు, అలాగే కోతుల బెడద, ప్రధానంగా గాంధీ చౌరస్తా,మోతుల గూడెం చౌరస్తాలో, ట్రాఫిక్ సమస్యలు, ఎండాకాలం వస్తున్న సందర్భంలో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు, డబల్ బెడ్ రూమ్ ఇండ్ల సమస్య, గత ప్రభుత్వంలో నిర్మాణం చేసిన ఇండ్లను మున్సిపాలిటీ పరిధిలోని ధర్మారం వార్డులో ఎవరి ఇష్టానుసారం వారు అక్రమన చేసుకొని ఇండ్లకు తాళాలు వేసుకుంటున్న చూసి చూడనట్లు వివరిస్తున్న మున్సిపల్ శాఖ మరియు రెవెన్యూ శాఖ అధికారులు, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి కేటాయించాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు.మున్సిపాలిటీ పరిధిలోని మంగళవారం వారసంత టెండర్ పూర్తయి, మున్సిపాలిటీకి 40 నుండి 50 లక్షలు ఆదాయం వస్తున్నప్పటికీ వారసంతలో మాత్రం ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయకుండా కాంట్రాక్టర్లు పాలకవర్గాలతో కుమ్మక్కై వినియోగదారులను అమ్మకం దారులను, తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. స్థానికంగా ఉన్న సమస్యలపై పరిష్కారం కోసం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో దశలవారీగా ప్రజల్ని సమీకరించి ఆందోళన పోరాటాల దిగుతామని ఈ సందర్భంగా తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు వడ్డూరి కిషోర్, గడ్డం శోభన్, లు పాల్గొన్నారు..



# దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు.

**కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 3:**


కమాన్ పూర్ మండలకేంద్రంలోని గోకుల్ నగర్ కురుమ సంఘం భవనంలో శుక్రవారం దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా కమాన్ పూర్ కురుమ సంఘం ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం నాయకులు మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక కొమురయ్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షులు గోపు మహేందర్ కురుమ, ఉపాధ్యక్షులు నరిగే శంకర్ కురుమ, స్థానిక 3వ వార్డ్ మెంబర్ గొట్టె సరిత–సంపత్ కురుమ, కురుమ సంఘం కార్యవర్గ సభ్యులు నరిగే చంద్రయ్య కురుమ, కంచు పోషాలు కురుమ, కోరే ఐలయ్య కురుమ, కురుమ సంఘం నాయకులు కొమ్ము చేరాలు కురుమ, కొమ్ము కుమారస్వామి కురుమ, గోపు పర్వతాలు కురుమ, గోపు చిన్న మల్లేష్, కొమ్ము శ్రీనివాస్ కురుమ, తూండ్ల శ్రీనివాస్ కురుమ, గొట్టె మల్లేష్ కురుమ, దయ్యాల కుమార్ కురుమ, తూండ్ల లక్ష్మణ్ కురుమ, దయ్యాల రమేష్ కురుమ, నరిగే కుమార్ కురుమ, దయ్యాల రాజు (మున్నా) కురుమ లతో పాటు తదితరులు పాల్గొన్నారు...



# ప్రధాని నరేంద్ర మోడీ తోనే దేశం అభివృద్ధి...!

**కమాన్ పూర్, నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 3:**

భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ తోనే దేశం అభివృద్ధి చెందుతుందని బిజెపి మండల శాఖ అధ్యక్షుడు కొయ్యడ సతీష్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనుల నిర్వాహణ కోసం నిధులు మంజూరు చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ కమాన్ పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద శుక్రవారం అంబేద్కర్ విగ్రహం ముందు మోడీ చిత్ర పటానికి బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. మంథని నియోజకవర్గ ఇన్చార్జి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల సునీల్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ...ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ రాష్ట్రంలోని 12,600 గ్రామపంచాయతీలకు 2,297 కోట్లు రూపాయలు విడుదల చేసి గ్రామ పంచాయతీ అభివృద్ధికి నిధులను కేటాయించడం జరిగిందన్నారు. ఈ నిధులతో గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు, వీధి దీపాలు ఏర్పాటు, సిసి రోడ్లు పలు గ్రామ అభివృద్ధి పనులకు కేంద్రం నిధులు కేటాయించడం జరిగిందన్నారు. రెండు సంవత్సరాలు గడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం శోచనీయం ఇపటికైనా రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ నుండి స్థానిక సంస్థలకు నిధులు కేటాయించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని బిజెపి మండల శాఖ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు కొయ్యడ సతీష్ యాదవ్, పెద్దపెల్లి జిల్లా ఉపాధ్యక్షులు మచ్చగిరి రాము, సీనియర్ నాయకులు మట్ట శంకర్, మాజీ బీజేపీ మండల అధ్యక్షులు జంగాపల్లి అజయ్, బీజేవైఎం మండల అధ్యక్షులు మల్లారపు అరుణ్ కుమార్, నాయకులు బర్ల సదానందం, పెద్దపెల్లి శ్యాంసుందర్, మోర ప్రశాంత్, ఆదిత్య,చిప్పకుర్తి సతీష్, సమ్మయ్యలతో పాటు తదితరులు పాల్గొన్నారు.




# దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శం కావాలి

## - బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి

**పెద్దపల్లిప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్:**

దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శం కావాలని బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య 99వ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి, దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య సాయుధ పోరాటంలో నేలరాలిన తొలి రక్తపు చుక్క అని,నిరంకుశ పాలన నుంచి స్వేచ్ఛ వాయువులు పీల్చేందుకు ఆత్మ గౌరవ పతాకాన్ని ఎగుర వేసేందుకు ప్రాణాలు పణంగా పెట్టిన గొప్ప యోధుడు కొమురయ్య అన్నారు. ఆ యన చూపిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. మహనీయులను ఒక కులానికో, ఒక వర్గానికో పరిమితం చేయకుండా ఆయన ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు, జిల్లా అధికారులు, కలెక్టరెట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# సమాజ సేవలో దుదిళ్ళ శ్రీపాద రావు పాత్ర చిరస్మరణీయం





-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

-దుదిళ్ళ శ్రీపాదరావు 27వ వర్ధంతి సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరం

-పేదలకు ఉచిత కంటి పరీక్షలు శస్త్ర చికిత్సలు అందించిన పుష్పగిరి ఆసుపత్రి

-ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**మంథని ప్రతినిధి (ముత్తారం), నేషనలిస్ట్ వాయిస్, ఏప్రిల్ 03:**

సమాజ సేవలో దుదిళ్ళ శ్రీపాద రావు పాత్ర చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం దుద్దిళ్ళ శ్రీపాదరావు 27వ వర్ధంతి సందర్భంగా ముత్తారం మండలంలోని పుష్పగిరి ఆసుపత్రి ఆధ్వర్యంలో పేద ప్రజల కోసం ఉచిత కంటి వైద్య శిబిరం, కంటి శస్త్రచికిత్స కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన ధన్వాడలో పుట్టి శాసనసభ స్పీకర్ స్థాయికి ఎదిగిన మహనీయులు దుద్దిళ్ళ శ్రీపాదరావు అని



పేర్కొన్నారు. న్యాయవాదిగా వృత్తి కొనసాగిస్తున్న సమయంలో ప్రజల ఆకాంక్షల మేరకు రాజకీయాల్లోకి వచ్చి, సర్పంచ్ స్థాయి నుంచి శాసనసభ స్పీకర్ స్థాయికి ప్రజల ఆశీర్వాదంతో ఎదిగారని తెలిపారు. నమ్ముకున్న సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న వ్యక్తి శ్రీపాదరావు అని కొనియాడారు. అలాగే మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలు నిర్వహించడం ద్వారా వారి జీవితంలోని ముఖ్యాంశాల నుంచి వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన పాఠాలను నేర్చుకోవచ్చని అన్నారు. శ్రీపాదరావు చూపిన మార్గంలోనే వారి కుటుంబ సభ్యులు అనేక సేవా కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం ఎంతో గొప్ప కార్యక్రమమని కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కంటి పరీక్ష చేయించుకున్నారు. ఈ శిబిరంలో వైద్యులు ఆధునిక పరికరాలతో కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేశారని, ఈ సేవల వల్ల అనేక మంది పేద ప్రజలు లబ్ధి పొందినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు మాట్లాడుతూ. శ్రీపాద రావు సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను కొనసాగించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా నిర్వహించేందుకు తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు..కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ఈ నెల 13 వ తేదీన కంటి అద్దాలు అందజేయడం జరుగుతుందని దుద్దిల్ల శ్రీను బాబు తెలిపారు ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డిసిపి భూక్య రామ్ రెడ్డి, ఏసిపి మడత రమేష్ లతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# సమిష్టి కృషితో ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి: సింగరేణి సంస్థ ఆర్.జి-త్రీ జి.యం

**కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 3.**

సమిష్టి కృషితోనే ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని సింగరేణి సంస్థ రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రామగుండం-3 ఏరియా ఓ.సి.పి-1 ఉపరితల గని నిర్దేశించిన ఓవర్బర్డెన్ వెలికితీత లక్ష్యాన్ని సాధించినందుకు గాను శుక్రవారం ఓ.సి.పి-1 ఉపరితల గని లో ఏర్పాటు చేసిన అభినందన సభకు రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరై అధికారులకు, ఉద్యోగులకు అభినందనలు తెలియజేశారు.

**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి యాజమాన్యం**

ఓ.సి.పి-1 ఉపరితల గనికి నిర్దేశించిన 60 లక్షల క్యూ. మీటర్ల డిపార్టుమెంటల్ లక్ష్యానికి గాను 64 లక్షల 32 వేల క్యూ. మీటర్ల వెలికితీత సమిష్టి కృషితో సాధించినందుకు సంబంధిత అధికారులకు, ఉద్యోగులకు అభినందనలు తెలియజేశారు. ఉద్యోగులందరూ భవిష్యత్తులో ఇదే ఒరవడిని కొనసాగిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సమిష్టి కృషితో, భద్రతతో సాధిస్తూ సింగరేణి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని, యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించాలని, యంత్రాలకు చిన్న, చిన్న మరమ్మతులు ఉన్న వాటిని త్వరగా పూర్తిచేసి అందుబాటులో ఉండేవిధంగా చూడాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించాలని కోరారు. అనంతరం మూడు షిఫ్ట్ లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రము, బహుమతిని అందజేశారు.



కార్యక్రమంలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రరెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవీణ్ వి ఫాటింగ్, ఇంచార్జ్ ఎస్వోటుజిఎం బి.వి.సత్య నారాయన, కాలరి మేనేజర్ రావుల పాపయ్య, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ వి.సునీల్ ప్రసాద్, పిట్ సెక్రటరీలు డి తిరుపతి రావు, గడ్డం తిరుపతి ఇతర అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో బంద్ విజయవంతం

## బంద్‌కు అన్ని వర్గాల సంపూర్ణ మద్దతు

## డంపింగ్ యార్డ్ ఏర్పాటు వెంటనే ఉపసంహరించుకోవాలి

**హుజురాబాద్ రూరల్, ఏప్రిల్ 03(నేషనలిస్ట్ వాయిస్):**

కరీంనగర్ జిల్లా హుజురాబాద్ లో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ ఏర్పాటు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పాడి కౌశిక్ రెడ్డి మరియు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. హుజురాబాద్ పట్టణంలోని వ్యాపార, వాణిజ్య రంగాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, హుజురాబాద్ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే ప్రజలు తీవ్రమైన అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. దేశానికి నాణ్యమైన విత్తనాలను అందించే ఈ ప్రాంతంలోని వ్యవసాయ భూములు నాశనం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం



వెంటనే స్పందించి డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, లేదంటే భవిష్యత్తులో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నెల 7, 8 తేదీల్లో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధర్నా కార్యక్రమంలో రెండు రోజుల పాటు పాల్గొంటానని తెలిపారు. బంద్‌కు సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజలకు అందుబాటులో వారసంత.

**కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 3.**

ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా అందుబాటులోకి వారసంతను తేవడం జరిగిందని రామగిరి మండలం కలవచర్ల గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి అన్నారు.రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి ఆధ్వర్యంలో వారసంత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వారసంత ప్రతి శు క్రవారంలి ఉదయం 10 గంటల నుండి నిర్వహించబడుతుంది.ఈ కార్యక్రమానికి రామగిరి తహసీల్దార్ సుమన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతులు పండించిన తాజా కూరగాయలను అతి తక్కువ ధరల్లో నేరుగా ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సెక్రటరీ శ్రీధర్ గారు తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై వారసంత ప్రారంభాన్ని స్వాగతించారు.



# బ్రహ్మోత్సవ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

**కొత్తపెల్లి మండలం 03(నేషనలిస్ట్ వాయిస్)**

బద్దిపల్లి గ్రామంలోని శ్రీ అలర్ మేల్ మంగ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆస్వామి వారి కృపా కటాక్షాలు పొందాలని కోరారు. మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్. శుక్రవారం రోజున కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ను ఆలయ కమిటీ బాధ్యులు వారి నివాసంలో.. కలిసి.. బ్రహ్మోత్సవ వేడుకలకు రావాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను వారు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈనెల 25వ తేదీ నుండి 27వ తేదీ వరకు అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో.. ఎమ్మెల్యే గంగులతో పాటు బద్దిపల్లి సర్పంచ్ తాండ్ర శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ పోరెడ్డి నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పోలు దాసరి శరత్, కోశాధికారి మిట్ట కమలాకర్, వైస్ చైర్మన్ తాండ్ర సుధాకర్, బద్దిపల్లి పలువురు పాలకవర్గ సభ్యులు.. ఆలయ కమిటీ బాధ్యులు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపడానికే గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

-కృష్ణవేణి హై స్కూల్ ప్రిన్సిపల్ అరిసె శ్రీనివాస్

-మంథని కేటీఎస్ లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే,స్పోర్ట్స్, కల్చరల్ మీట్ వేడుకలు

**మంథని ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్, ఏప్రిల్ 03:**

గ్రాడ్యుయేషన్ డే వంటి వేడుకలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపడంతో పాటు భవిష్యత్ లక్ష్యాల వైపు దృష్టి సారించేందుకు ప్రేరణనిస్తాయని మంథని కృష్ణవేణి హై స్కూల్ ప్రిన్సిపల్ అరిసె శ్రీనివాస్ అన్నారు.విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసానికి నాంది పలికేందుకు మంథని పట్టణంలోని కృష్ణవేణి హై స్కూల్లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను పాఠశాల ప్రిన్సిపల్ అరిసె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్నారులు తమ ప్రాథమిక విద్యను పూర్తి చేసి ఉన్నత విద్య దిశగా అడుగులు వేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించమన్నారు. విద్య అనేది వ్యక్తిత్వ వికాసానికి పునాది అని, ప్రాథమిక దశలోనే విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, లక్ష్యసాధన వంటి విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు జాఫర్ హుస్సేన్, సుదర్శన్ రెడ్డి, నరేష్ లు , ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.







# అనాధాశ్రమంలో బియ్యం పనులు పంపిణీ.

**కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 3. పెద్దపల్లి జిల్లా**

అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన లగిశెట్టి రవి- లావణ్య దంపతుల 18వ పెళ్లి వేడుకలను తబిత ఆశ్రమ పిల్లల మధ్య పెళ్లిరోజు వేడుకలను జరుపుకోవడం జరిగింది. అలాగే ఆశ్రమంలోని అనాథ పిల్లలకు రైస్ పండ్ల పంపిణీ చేయడం జరిగింది. అనంతరం ఆశ్రమంలోని పిల్లలు రవి- లావణ్య దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు కోల లక్ష్మణ్ గౌడ్, పెద్దంపేట్ పంచాయతీ వార్డు సభ్యులు ఆడెపు ప్రేమ ,వాణి శేఖర్, గ్రామ నాయకులు మెరుగు సతీష్ గౌడ్, ఆశ్రమ నిర్వాహకులు వీరేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిసిన ప్రణవ్

**హుజురాబాద్ రూరల్, ఏప్రిల్ 03(నేషనలిస్ట్ వాయిస్):**

హుజూరాబాద్ పట్టణ పరిధిలోని సిర్సపల్లి శివారులో నిర్మించ తలపెట్టిన డంప్ యార్డ్ ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వ సలహాదారు,రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ ని కలిసి దాని వల్ల వచ్చే అనర్థాలను,ఇతర ప్రాంతాలకు తరలిస్తే ప్రజలకు ఎంత ఉపయోగమో వివరించారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.ఈ ప్రాంతం వ్యవసాయానికి మూలాధారమని ప్రజల మనోభావాలు అర్థం చేసుకొని,ఈ వేస్ట్ టు ఎనర్జీ యార్డుతో జనాలతో పాటు,వాటి వ్యర్థాల వల్ల పంట పొలాలకు కూడా ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు.జనావాసాల మధ్య కాకుండా వేరేచోటుకి దీన్ని మార్చాలని కోరారు.ఈ విషయమై ఇప్పటికే వారంలో రెండవ సారి కలిశామని దీనిపై ఎలాంటి ముందుకు వెళ్లొద్దని,సీఎం దృష్టికి ఈ విషయం తెలపాలని కోరారు.సానుకూలంగా స్పందించిన ఎంపీ ఈ విషయమై చర్చిస్తామని భరోసా కల్పించారు.



# తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడిగా చందర్

**పెద్దపల్లి ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్:**

పెద్దపల్లిలో శుక్రవారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా కార్యాలయాన్ని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రజిని కుమార్ ప్రారంభించారు. జిల్లా అధ్యక్షుడిగా మెరుగు చందర్ ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. అనం తరం వర్కింగ్ ప్రెసిడెంట్ రజిని కుమార్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చా రు. గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీని విస్తరించడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు చందర్ మాట్లాడు తూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కృషి చేస్తానన్నారు. కార్య కర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజల సమస్యలను ముందుకు తీసుకెళ్లి పార్టీని మరింత బలపరచడమే తన ప్రాధాన్యమని చెప్పారు. పె ద్దపల్లిలో టీఆర్పీ కార్యాలయం ప్రారంభం కేవలం ఓ కార్యక్రమం మాత్రమే కాకుండా ప్రాంతీయ రాజకీయాల్లో కొత్త సమీకరణా లకు సంకేతంగా కనిపిస్తోంద న్నారు. స్థానికంగా కొత్త నాయకత్వాన్ని ముందుకు తెచ్చే ప్రయత్నం ద్వారా పార్టీ తన విస్తరణ వ్యూహాన్ని అమలు చేస్తోందని స్పష్టమ వుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదశి అఖిల్ భాష, సంజీవ్, జాషువా, శివదాసు రమేష్, నరేష్, మెరుగు సతీష్, ఎర్రం సతీష్, తదితరులు పాల్గొన్నారు.






# దొడ్డి కొమురయ్య ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తి

కొమురయ్య స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం

తెలంగాణ భగత్ సింగ్ దొడ్డి కొమురయ్య

దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్.

**జగిత్యాల ప్రతినిధి : నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 03 :**

తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ వీరుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 99వ జయంతి వేడుకలను జగిత్యాల పట్టణ ధర్మపురి రోడ్డులో గల విజయపురిలో శు క్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తి అని, ఆయన స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని, తెలంగాణలో మరో భగత్ సింగ్ లా దొడ్డి కొమురయ్య పోరాటం చేశారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి – శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, ఏఎంసి ఛైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ స్పందన, కౌన్సిలర్ లు చెట్టె గంగాధర్ , దయాళ చంద్రకళ – శంకర్, కోరె జయ – గంగమల్లు, పిట్ట ధర్మరాజు, ఏనుగుల లావణ్య – రాజు, కూతురు రాజేష్, చీటి లక్ష్మీ నారాయణ, దుమాల రాజ్ కుమార్, హరీష్, మమత రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ కూసరి అనిల్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు బీరం రాజేష్, నాయకులు బాల ముకుందం, దయాళ మల్లారెడ్డి, పుల్ల మల్లయ్య, కురుమ సంఘం సభ్యులు, పట్టణ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య

జగిత్యాల కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు

**జగిత్యాల ప్రతినిధి : నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 03 :**

తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 99వ జయంతి వేడుకలను జగిత్యాల కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత పూలమాల వేసి, నివాళులర్పించారు. సందర్భంగా ఎమ్మెల్యే అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... తెలంగాణలో రైతాంగం కోసం దొడ్డి కొమురయ్య అనుపెరుగని సాయుధ పోరాటం చేసి తొలి అమరుడు అయ్యాడని, ఆయన స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి – శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, ఏఎంసి ఛైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, బిసి వెల్ఫేర్ అధికారిణి సుజాత, జిల్లా వెటర్నరీ అధికారి డా.నరేష్, డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీనివాస్, ఏఓ హాకిం, స్తానిక కౌన్సిలర్ ప్రశాంత్ రావు, మున్సిపల్ కౌన్సిలర్ లు, కురుమ సంఘం సభ్యులు , పట్టణ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.






# గట్టుబూత్కూర్ లో రాములవారి రథోత్సవంలో పాల్గొన్న సర్పంచ్

**చొప్పదండి ని.వటగంగాధర మండలంఊ ఏప్రిల్ 3,నేషనలిస్ట్ వాయిస్**

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గట్టుభూత్కూర్ గ్రామంలో శ్రీ రాములవారి రాథోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు.గ్రామంలో ప్రధాన వీదుల గుండా శ్రీ రాముల రథాన్ని ఊరెగింపుగా తీసుకొని వెళ్ళారు. ఇంటింటా మంగళ హారథులతో స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్కాపురం రాజేశ్వరి రాజేశం గౌడ్,గ్రామ ఉపసర్పంచ్ పాలక వర్గం, గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్లులు ఎంపీటీసీలు, శ్రీ రామ దీక్ష స్వాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# సంబోజు మృతి పత్రికా రంగానికి తీరని లోటు..

## నివాళులు అర్పించిన టీయూడబ్ల్యూజే జిల్లా శాఖ

**కరీంనగర్ ఏప్రిల్ 03(నేషనలిస్ట్ వాయిస్)**

తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యులు సీనియర్ జర్నలిస్టు చొప్పదండి వార్త విలేకరి సంబోజు శేఖర్ ఈ రోజు ఉదయం గుండెపోటు తో మరణించారు ఆయన మరణం జర్నలిస్టు సమాజానికి జర్నలిస్టు సంఘానికి తీరని లోటని టీయూడబ్ల్యూజే ఐజేయూ కరీంనగర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గాండ్ల శ్రీనివాస్ కొయ్యడ చంద్రశేఖర్ అన్నారు. యూనియన్ పక్షాన తక్షణ సహాయంగా 10 వేల రూపాయలు అందజేసి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి ఊరడి రవీందర్ జిల్లా కార్యవర్గ సభ్యులు జన్నారం శ్రీనివాస్ కంకణాల రఘు పాల్గొన్నారు.



# ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మి నిర్వాసితులు ఆందోళనకు గురి కావద్దు

## 15 రోజుల్లో నారాయణపూర్ గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడుతాం

## చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**చొప్పదండి ని.వ టగంగాధర మండలం ఊఏప్రిల్ 3,నేషనలిస్ట్ వాయిస్**

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్ క్రింద ముంపునకు గురవుతున్న భూ నిర్వాసితులను అన్ని రకాలుగా ఆదుకొని న్యాయం చేస్తామని చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా ఇచ్చారు. నారాయణపూర్ రిజర్వాయర్ క్రింద ఇండ్లు కోల్పోయి, పరిహారం మంజూరైన లబ్ధిదారులు శుక్రవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను గంగాధర మండలం మధురానగర్ లోని కాంగ్రెస్ పార్టీ ప్రజా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే ను శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నారాయణపూర్ గ్రామస్తులను దశలవారీగా ఆదుకోవడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి గ్రామస్తులు ఆందోళనకు గురి కావద్దని సూచించారు. 15 రోజుల్లో నారాయణపూర్ గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడుతామని తెలిపారు. రిజర్వాయర్ క్రింద ఉన్న ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామడుగు మల్లేశం,బాబు మల్లేశం,బుర్ర కిరణ్, గడ్డం కార్తిక్,రాగుల మల్లయ్య,నరాల శ్రీనివాస్,లోకిని తిరుపతి ,బాబు నవిన్ తదితరులు పాల్గొన్నారు.




# నేత్రదాత కుటుంబానికి అభినందనలు.

**కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 3.**

నేత్రదాత మెండే ఏ పుట్ట అంకులు సంస్మరణ సభను నిర్వహించిన కుటుంబ సభ్యులు మరియు సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, పాలకుర్తి మండల అధ్యక్షులు పృథ్వీరాజ్ శుక్రవారం పెద్దపల్లి జిల్లా, పాలకుర్తి మండలం కన్నాల, షలపల్లి గ్రామ నివాసి నేత్రదాత సంస్మరణ సభను వారి కుటుంబ సభ్యులు మరియు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ మేరుగు భీష్మాచారి, పాలకుర్తి మండల అధ్యక్షులు పృథ్వీరాజ్...నేత్ర అవయవ శరీర దానాలపై అవగాహన కల్పించినారు. సదాశయ ఫౌండేషన్ జ్ఞాపికను భార్య లక్ష్మీదేవి, కొడుకులు కోడన్లు మెండే శ్రీనివాస్ –సత్యవతి, అంజయ్య – అనసూర్య, సత్యనారాయణ – రాధ, కుమార్ – వసంత కూతురు అల్లుడు దరవేణి సునీత – రాజు మరియు మనుమలు మనుమరండ్లకు అందజేసి అభినందనలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జిల్లా సలహాదారులు దేవీ లక్ష్మినర్సయ్య, ప్రతినిధులు క్యాతం మల్లేశం, చింతకింది కనకయ్య, బొడ్డుపెల్లి లక్ష్మణ్, మేన మహేందర్, కుందరపు సతీష్,ఆరుకల సతీష్, బుర్ల నారాయణ, ముంజ రాజు, డా. మల్లేశం, లక్ష్మణ్ రావు పాల్గొని నేత్రదాతకు నివాళులు అర్పించి కుటుంబానికి అభినందనలు తెలిపినారు.సమాజ హితం కాంక్షించి నేత్రదానం చేసిన కుటుంబానికి సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ ,ప్రధాన కార్యదర్శి లింగమూర్తి,, గౌరవ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారులు రమేష్ ,జిల్లా గౌరవ అధ్యక్షులు లగిశెట్టి చంద్రమౌళి, కృతజ్ఞతలు తెలపడం జరిగింది.




# 'బెస్ట్ రన్నర్స్' యూనిఫారాలతో నూతన కల.









## రంగు రంగుల్లో విద్యార్థుల యూనిఫారాలు.

**కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 3.**

బెస్ట్ రన్నర్స్ వారు విద్యార్థులకు అందించిన యూనిఫారాలతో పాఠశాలకు నూతన కల వచ్చింది. కమాన్ పూర్ మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు 'బెస్ట్ రన్నర్స్' ప్రతినిధి కోలేటి సతీష్ ఆధ్వర్యంలో కమాన్ పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని 215 మంది విద్యార్థులకు వివిధ రంగుల్లో దుస్తులను అందజేశారు. ఆ విద్యార్థులు ఆయా దుస్తులను పాఠశాలకు వేసుకోవడంతో పాఠశాలకు ఇంద్ర ధనస్సుల ఆ యూనిఫారాలు కళకళలాడుతున్నాయి. బెస్ట్ రన్నర్స్ వారు గతంలో పెద్దపెల్లి జిల్లాలోని అల్లూరు,



గోదావరిఖని, ఎనిమిదవ కాలనీ, అడవి శ్రీరాంపూర్, కన్నాల, రాగనేడు, ఎలుకలపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో ఒకే రంగు దుస్తులు ఆయా పాఠశాలల్లోని మొత్తం విద్యార్థులకు అందజేయడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలకు చేయూతనివ్వడమే తమ ప్రధాన కర్తవ్యమని బెస్ట్ రన్నర్స్ ప్రతినిధి కోలేటి సతీష్ పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలకు మరింత చేయుటనిస్తామని త్వరలోనే కమాన్ పూర్ పాఠశాలకు జూన్ నెలలో ఎంఈఓ కోరిక మేరకు మరిన్ని వస్తువులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. కాగా ఆ యూనిఫారాలను ప్రతి బుధవారం, శుక్రవారాల్లో విద్యార్థులు వేసుకోవడం జరుగుతుందని ఎంఈఓ తెలిపారు. పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడం ఆనందం గా ఉందని సతీష్ పేర్కొన్నారు.

**యూనిఫారాలు అందించిన సతీష్ కు ధన్యవాదాలు.**

**ఎం ఈ ఓ ఇల్లందుల విజయ్ కుమార్.**

కమాన్ పూర్ జిల్లా పరిషత్ పాఠశాల లోని 215 మంది విద్యార్థులకు వివిధ రంగుల్లో యూనిఫారాలను అందజేసిన బెస్ట్ రన్నర్స్ ప్రతినిధి కోలేటి సతీష్ కు అలాగే యూనిఫారాల కోసం కృషిచేసిన మా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రేణుకకు ధన్యవాదాలు అని కమాన్ పూర్ ఎంఈఓ ఇల్లందుల విజయ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ యూనిఫారాలు ఇవ్వడానికి పరోక్షంగా కృషి చేసిన మాజీ ఎంపీపీ కోలేటి మారుతికి, కోలేటి అంజన్నకు కృతజ్ఞతలు అని అన్నారు. ఈ యూనిఫారాలతో పాఠశాలలో నూతన సంతరించుకుందని విజయకుమార్ పేర్కొన్నారు.

# తనిఖీ చర్యలలో భాగంగా ఫిట్నెస్ లేని సాని డంపర్లను నిలిపివేసిన డిప్యూటీ డైరెక్టర్ మైన్ సేఫ్టీ





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి (నేషనలిస్ట్ వాయిస్) ఏప్రిల్ : 03**

సింగరేణి మణుగూరు ఏరియా పీకే ఓసి సెక్షన్–2 లో పనిచేస్తున్న విపిఆర్ దుర్గ (డీఐఎంపీఎల్) ఓబీ కంపెనీలో ఆదివారం జరిగిన ప్రమాద సంఘటన నేపథ్యంలో డిప్యూటీ డైరెక్టర్ మైన్స్ సేఫ్టీ దిలీప్ కుమార్ రక్షణ తనిఖీ చర్యలు చేపట్టారు. ఈ తనిఖీలలో లో గుర్తించిన ఫిట్నెస్ సర్టిఫికేట్ మరియు అవసరమైన అనుమతులు లేని సుమారు వందకి పైగా సానీ డంపర్లను నిలిపివేశారు. గురువారం (రెండో తేదీ ) సెకండ్ షిఫ్ట్ బ్లాస్టింగ్ తర్వాత మొత్తం వాహనాల్లో కేవలం ముప్పై ఐదు భారీ డంపర్ లకే ఫిట్నెస్ అనుమతులు ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన ఫిట్నెస్ లేని వాహనాల




పనులను పూర్తిగా పార్కింగ్ యార్డ్కే పరిమితం అయ్యేలా నిలిపివేశారు. ఈ ప్రమాద సంఘటన ఒక ఓబి వర్కర్ చనిపోయిన నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు, ప్రమాద సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అనుక్షణం కార్మికులను సూపర్వైజర్లను అప్రమత్తం చేయాలని , వ్యక్తిగత రక్షణ పరికరాల ధరింపు, పని స్థలాలలో రక్షణ చర్యలు,హాల్ రోడ్స్, లైటింగ్, వాటర్ స్ప్రేయింగ్ తదితర అంశాలలో ప్రమాదాలు నివారణకు చేపట్టవలసిన రక్షణ చర్యలకు సంబంధించి తగు సూచనలతో కూడిన ఆదేశాలు ఓబి యాజమాన్యానికి జారీ చేసినట్లు తెలిసింది, అలాగే పర్యవేక్షణకు సంబంధించి సింగరేణి యాజమాన్యానికి కూడా తగు ఆదేశాలు అనగా కోల్ మైన్స్ రెగ్యులేషన్ (సిఎంఆర్ 2017) నిబంధనల ప్రకారం రక్షణ సూత్రాలు పాటించాలని ప్రతిరోజు క్రమం తప్పకుండా సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ (యస్ యం పి) స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ (యస్ ఓ పి) ప్రకారం గనిలో పనిలో గ్యారేజీలో అట్టి ఆదేశాలు అమలు చేయాలని లిఖితపూర్వక ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

# అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి వ్యాపారులు, స్థానికుల డిమాండ్...

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి (నేషనలిస్ట్ వాయిస్) ఏప్రిల్ :03**

మణుగూరు మండలంలో ప్రారంభమైన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు దీర్ఘకాలంగా పూర్తికాకపోవడం పట్ల స్థానిక వ్యాపారులు మరియు ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరాలు గడిచినా మార్కెట్ అందుబాటులోకి రాకపోవడంతో చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో వ్యాపారులు రోడ్లపైనే ఎండలో వ్యాపారాలు నిర్వహించాల్సి వస్తోంది. దీని వల్ల వారి ఆదాయం తగ్గిపోవడంతో పాటు జీవనోపాధి దెబ్బతింటోందని వారు వాపోతున్నారు. ఇదిలా ఉండగా, నిర్మాణ బాధ్యతలు చేపట్టిన కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే నిలిపివేసి ఇతర ప్రాంతాల్లో కొత్త పనులు చేపడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసంపూర్తిగా వదిలేసిన నిర్మాణం శిథిలావస్థకు చేరుకుంటూ అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై మున్సిపాలిటీ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. పెండింగ్ పనులను పూర్తి చేయకుండా కాంట్రాక్టర్లకు కొత్త పనులు అప్పగిం చడం సరికాదని, ముందుగా ఈ మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయిం చాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వారు సూచిస్తున్నారు. ఇప్పటికైనా సంబ ంధిత అధికారులు స్పందించి, ఇంట గ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో మున్సిపాలిటీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు సిద్ధమని హెచ్చరించిన రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ.



# జిల్లాలో జనగణన పనులు సమగ్రంగా చేపట్టాలి - కలెక్టర్ అంకిత్





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి (నేషనలిస్ట్ వాయిస్) ఏప్రిల్ : 03**

జిల్లాలో జాతీయ జనగణన కార్యక్రమాన్ని సమగ్రంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. జనగణన ప్రక్రియలో ప్రతి ఇంటిని కవర్ చేస్తూ, ఎలాంటి లోపాలు లేకుండా ఖచ్చితమైన డేటా సేకరణ జరగాలని ఆయన అన్నారు .జాతీయ జనగణన కార్యక్రమం భాగంగా ఏప్రిల్ 1 నుండి 3 వరకు జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో ఫీల్డ్ ట్రైనర్స్‌కు మూడు రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహించబడినట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించబడగా, ఫీల్డ్ స్థాయిలో పని చేసే సిబ్బందికి అవసరమైన అన్ని అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో మాస్టర్ ట్రైనర్స్‌గా ఎన్. శివరామకృష్ణ, డాక్టర్ పి. సుస్మిత రజిని పాల్గొని, మొత్తం 34 మంది ఫీల్డ్ ట్రైనీస్‌కు జనగణన నిర్వహణ విధానం, హౌస్ సెన్సెస్, డేటా సేకరణలో పాటించాల్సిన జాగ్రత్తలు, డిజిటల్ పద్ధతుల వినియోగం తదితర అంశాలపై విపులంగా శిక్షణ అందించారు. శిక్షణలో భాగంగా మూడవ రోజు పాలకోయ తండా ప్రాంతంలో ప్రాక్టికల్ డెమో నిర్వహించారు. ఫీల్డ్ ట్రైనీస్‌ను అవుట్ ఫీల్డ్‌కు తీసుకెళ్లి, ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరించే విధానాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మొదటి ఇంటిలో హౌస్ సెన్సెస్ కార్యక్రమాన్ని కలెక్టర్ అంకిత్ IAS సమక్షంలో నిర్వహించారు. ఈ డెమో ద్వారా ఫీల్డ్ ట్రైనీస్‌కు ప్రత్యక్ష అనుభవం లభించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనగణనలో సేకరించే సమాచారం ప్రభుత్వ విధానాల రూపకల్పనకు ఎంతో కీలకమని అన్నారు . అందువల్ల ప్రతి వివరాన్ని శ్రద్ధగా నమోదు చేయాలని, ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారికి అవసరమైన సమాచారం అందిస్తూ డేటా సేకరణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెన్సెస్ జిల్లా అధికార సిబ్బంది, సి.పి.ఓ. సంజీవరావు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అనంతరం శిక్షణా కార్యక్రమం కొనసాగింది.

# సూరం రవీందర్ రెడ్డికి డిసిసి ఉపాధ్యక్ష పదవి రెండోసారి





## పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రం స్వీకారం

**నేషనలిస్ట్ వాయిస్:తాండూర్**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెన్నార్ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా సూరం రవీందర్ రెడ్డి మంచిర్యాల జిల్లా డిసిసి ఉపాధ్యక్షులుగా రెండవసారి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన సూరం రవీందర్ రెడ్డి, తనపై నమ్మకం ఉంచి మరోసారి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలంగా నిలపడానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.


# శ్రీపాద స్మారక క్రికెట్ పోటీలు.























**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఏప్రిల్ 3.**

అతి త్వరలో స్వర్గీయ శ్రీపాద రావు స్మారక కేపీఎల్ క్రికెట్ టోర్నీ స్వర్గీయ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు స్మారకార్థం కమాన్ పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వెనుక గల పోచమ్మ కుంట మైదానంలో.. అతి త్వరలో ప్రారంభం కానున్న ఐపీఎల్ తరహాలో కమాన్ పూర్ ప్రీమియర్ లీగ్ టోర్నీ ( మంథని నియోజకవర్గ స్థాయి) టోర్నమెంట్ ను ప్రారంభించడం జరుగుతుందని కుక్క కుమార్ మేరుగు కుమార్ మేడగొని సాయి కొండయ్య తెలిపారు. స్పాన్సర్స్ గా కాంగ్రెస్ పార్టీ కమాన్ పూర్ మండల అధ్యక్షులు సయ్యద్ అన్వర్, జూలపల్లి మాజీ ఎంపీటీసీ ముత్యాల దామోదర్, నాయకులు ఇనగంటి రామారావు, పిట్ల గోపాల్, అంబీరు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రెబల్ రాజ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు మెహర్ రాజ్ ఖాన్, వ్యవహరించడం జరుగుతుందని పేర్కొన్నారు.



# చికెన్ మటన్ షాపులను వాడుకలోకి తీసుకురావాలి.

**కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 3.**




రామగిరి మండలంలోని సెటినరీ కాలనీలో సింగరేణి సంస్థ వారు నిర్వహించిన చికెన్ మటన్ కేంద్రాలను వాడుకలోకి తీసుకురావాలని బిజెపి నాయకుడు మల్యారి శ్రీనివాస్ సింగరేణి సంస్థానం డిమాండ్ చేశారు.రామగిరి మండలం సెంటనరీ కాలనీ లో కార్మికుల కోసం మటన్ చికెన్ చాపలు షాపులను ఒకే కాడ ఏర్పాటు చేస్తామని సింగరేణి యజమాని కార్మికుల సంక్షేమం కోసం 25 లక్షల తో గత ఆరు సంవత్సరాల క్రింద నిర్మాణం చేపట్టారు ఇప్పటివరకు కూడా దానిని ప్రారంభించకపోవడం కార్మికులు మేము ఎంతో కష్టపడి కంపెనీ లాభాలకు చేస్తే అధికారులు మాత్రం ఇలా వృధాగా ఇష్టరాజ్యాంగ ఖర్చు పెడుతున్నారు వృధాగా ఉన్న మటన్ చికెన్ సెంటర్ను చూసి సింగరేణి అధికారులపై కార్మిక కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు అసాంఘిక కార్యకారపాలకు అడ్డాగా మారింది, వెంటనే ఈ యొక్క చికెన్ మటన్ సెంటర్ ను ప్రారంభించక పోతే జిఎం ఆఫీస్ ఆర్ జి త్రీ ముట్టడి చేస్తాం అన్నారు బిజెపి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం లో ఈ బిజెపి జిల్లా మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రగతి ప్రణాళికలో 99 రోజుల్లో కార్యక్రమంలో దీనిని కూడా చేయాలి అని పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉద్యో గాల పేరుతో దళారులను న మ్మి మోసపోవద్దు

## - పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్

**పెద్దపల్లి ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్:**




పెద్దపల్లి జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని, పెండింగ్ బిల్లులు క్లియర్ చేయిస్తామని చెప్పే ఏజెంట్లను, దళారులను నమ్మి మోసపోవద్దని పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియా ద్వారా పేర్కొంటూ ఎలాంటి బిల్లులను కూడా జిల్లా స్థాయిలో మంజూరు చేయరనే విషయాన్ని గమనించాలని ఆయన సూచిం చారు. ఎవరికో డబ్బులు ఇచ్చి మోసపోవద్దని ఆయన స్పష్టం చేశారు. అలాగే నిరుద్యోగులు ప్రభుత్వ ఆసుపత్రులలో ఎవరైనా ఉద్యోగాలు పెట్టిస్తామంటే నమ్మ వద్దని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు వారధి సొసైటీ ద్వారానే జిల్లా కలెక్టర్ పెద్దపల్లి ఆధ్వర్యంలో భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఇలాంటి విషయంలో ఉద్యోగ ఆశావహులు పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో గల వారధి ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేసుకోగలరని, ఏవైనా ఉద్యోగ అవకాశాలు వుంటే వారికి ఇన్ఫర్మేషన్ అందచేయ బడుతుందన్నారు. అదే విధంగా పెద్దపల్లి జిల్లా ప్రజలకు అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పించడానికి తమ వైద్యులు, మిగతా సిబ్బంది ఎల్లవేళల అందుబా టులో ఉంటారని ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు.

# 107% ఓవర్ బర్డెన్ ఉత్పత్తి లక్ష్యాన్ని కంపెనీ ఎక్విప్మెంట్ తో సాధించడంపట్ల గని ఉద్యోగులకు అభినందనలు

## -జనరల్ మేనేజర్ శ్రీ సుంకర మదుసూదన్

**కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 3.**

2025-26 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి ఆర్జీ-3 ఏరియా ఆర్జీ ఓసీ-1 గనిలో 6,000,000 క్యూ.మీ. లక్ష్యాన్ని 107%తో అధిగమించి 6,431,950 క్యూ.మీ. ఓవర్‌బర్డెన్ ఉత్పత్తిని కంపెనీ ఎక్విప్మెంట్ తో సాధించడంపట్ల గని ఉద్యోగులను అభినందిస్తూ జనరల్ మేనేజర్ సుంకర మదుసూదన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించుటకు నిబద్ధతతో పనిచేసి తోడ్పడిన అడిషనల్ మేనేజర్ బైరి రమేష్, హెడ్ ఓవర్మెన్లు భీమాని సంపత్, వేముల రాజేశం, ఎలిగేటి ఆనందం, కోట రమేష్, షావెల్ ఆపరేటర్స్ పింగిలి సంపత్ రెడ్డి, చింతల రఘు చంద్రమౌళి, కామ తిరుపతయ్య, చెలిమెల శ్రీనివాస్, డంపర్ ఆపరేటర్లు కనకం మోహన్, కొప్పుల సంజీవ్ కుమార్, సానా శ్రీనివాస్ లకు గని ప్రాజెక్ట్ అధికారి ప్రవీణ్ వీ ఫాటింగ్ అభినందిస్తూ జారిచేయబడిన ప్రశంస పత్రాలను జనరల్ మేనేజర్ శ్రీ సుంకర మదుసూదన్ అందజేశారు. గనిలో పరిస్థితులను నైపుణ్యంతో అధిగమించి పనిచేసిన ఉద్యోగులందరినీ మెచ్చుకుంటూ గని విస్తరణలో భాగంగా అనుమతులకు పనిచేస్తున్నామని త్వరలోనే ఓసి1 పూర్వ వైభవం మెగా ఓసి ఆర్జీ కోల్ మేన్స్ పేరుతో నడుస్తుందని ఇదే నిబద్ధతతో, రక్షణతో పని చేస్తూ మంచి అలవాట్లతో ఆరోగ్యంగా ఉండాలని కోరారు. అనంతరం గనిలో దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం మధుసూదన్ గారిని శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గని ప్రాజెక్టు అధికారి ప్రవీణ్ వి ఫాటింగ్, ఐఎన్టీయూసీ ఆర్జి3 ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్, ఏఐటీయూసీ ఆర్జి3 కార్యదర్శి ఎంఆర్సిరెడ్డి, పిట్ కార్యదర్శి డిటిరావు, అధికారుల సంఘం ఆర్జి3 అధ్యక్షులు కోలా శ్రీనివాస్, గని మేనేజర్ పాపయ్య, కాలరీ ఇంజనీర్ జిఎస్.నజీర్ అహ్మద్, సంక్షేమ అధికారులు సునీల్ ప్రసాద్, కోకాసాయి స్వరూప్, అధికారులు సూపర్వైజర్లు ఉద్యోగులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులు సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలి





-ఈ నెలాఖరు నాటికి అయ్య గారి చెరువు రీ మోడలింగ్ పనుల్లో 50 శాతం పూర్తి చేయాలి

-దర్యాపూర్ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి కావాలి

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

-మంథని, ముత్తారం ప్రాంతంలో పర్యటించిన జిల్లా కలెక్టర్

**మంథని ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్, ఏప్రిల్**

మంథని ముత్తారం ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులు సమయానికి నాణ్యతతో పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని పట్టణం లోని అయ్యగారి చెరువు రీ మోడలింగ్ పనులను, ముత్తారం మండలంలోని దర్యాపూర్ గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో కోటి రూపాయల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష జిల్లాలో అభివృద్ధి పనులు సమయానికి, నాణ్యతతో పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ముత్తారం మండలంలోని దర్యాపూర్ మోడల్ స్కూల్ లో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1 కోటి నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పనుల పురోగతి పై సమగ్రంగా ఆరా తీసి, ఇప్పటికే ఆమోదించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదనపు పనుల కోసం మరిన్ని నిధులు అవసరమైతే వెంటనే అంచనాలు సిద్ధం చేసి సమర్పించాలని, అంచనాలు అందిన వెంటనే అవసరమైన అదనపు నిధులను మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం మంథని మున్సిపాలిటీ పరిధిలోని అయ్యగారి చెరువు రీ-మోడలింగ్ పనులను కలెక్టర్ పరిశీలించారు. చెరువు పునర్నిర్మాణ పనులను వచ్చే సోమవారం నుంచి ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి ప్రతిపాదిత పనుల్లో కనీసం 50 శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనులు వేగవంతంగా, నాణ్యతతో కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ సహనం శాంతికి నిర్వచనం క్రీస్తు






-మానవాళి పాప పరిహార్థం క్రీస్తు సిలువ మరణం

-పాస్టర్ దూడ మహేష్

-శ్రీపాద కాలనీ చర్చి నుండి అంబేద్కర్ చౌక్ వరకు సిలువ ధ్యాన సువార్త ర్యాలీ

**మంథని ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్, ఏప్రిల్**

ప్రేమ సహనం శాంతికి నిర్వచనం క్రీస్తు ప్రభువు అని, ఆయన చూపించిన మార్గంలో అందరు నడుస్తూ ప్రపంచం శాంతిమయం కావాలని, క్రీస్తు బోధనలు ప్రపంచశాంతికి దిక్సూచి అని, యేసు అనుగ్రహం అందరిపై ఉండాలని పాస్టర్ దూడ మహేష్ పేర్కొన్నారు. క్రైస్తవుల పర్వదినం గుడ్ ఫ్రైడే పండుగ సందర్భంగా శుక్రవారం మంథని మున్సిపల్ పరిధి శ్రీపాదకాలనీ సీయోను చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకల్లో ఆయన మాట్లాడుతూ మానవాళి పాప పరిహార్థం క్రీస్తు సిలువ మరణం పొందాడని, ప్రేమ, సహనం, శాంతికి నిర్వచనం యేసు క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి దిక్సూచి అని, మానవవాళికి ప్రేమ, శాంతిమార్గం చూపిన మహనీయుడు యేసుక్రీస్తు అని అన్నారు. అతడి అనుగ్రహం అందరిపైనా ఉండాలని తెలిపారు. జీసస్ బోధనలతో ప్రపంచ శాంతి మయం కావాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. యేసుక్రీస్తు ప్రభువు సత్యాన్ని ఏనాడు విడనాడలేదని, తను నమ్మిన సిద్ధాంతం కోసం, తన భక్తుల కోసం ప్రాణాలు అర్పించిన గొప్పమహనీయుడని ఆయనను కొనియాడారు. క్రీస్తు బోధనలు అందరూ అవగతం చేసుకొని, సన్మార్గంలో ముందుకెళ్లాలని ఆయన తెలిపారు. యేసు దైవత్వము సంబంధించిన విద్యను క్రిస్టోలోజి అని పిలు స్తారని, చరిత్రకారులు మానవ చరిత్రను యేసు క్రీస్తు జీవించిన కాలాన్ని కొలమానంగా తీసుకుంటారు. క్రీస్తు జన్మించకముందు కాలాన్ని క్రీస్తుపూర్వం అని, క్రీస్తు జన్మించిన తర్వాత కాలాన్ని క్రీస్తుశకం అని పేర్కొంటారని వివరించారు. క్రీస్తు ప్రభువు సూచించిన మార్గంలో నడుస్తూ ప్రతి ఒక్కరి హృదయాల్లో ప్రేమ నిండాలని తెలిపారు. ప్రేమ, కరుణ, క్షమాగుణాలను ఏసు తన జీవిత సందేశంగా మానవాళికి అందించారు. ప్రతి మనిషి పరోపకారం అలవరుచుకోకపోతే జీవితానికి అర్థం ఉండదన్నారు. ఈ సందర్భంగా యేసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను ద్యానించారు. అనంతరం శ్రీపాద కాలనీ చర్చి నుండి అంబేద్కర్ చౌక్ వరకు సిలువ ధ్యాన సువార్త ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు మంథని మార్క్, అజ్మీరా దయారాజు, కలువల సామ్యూల్, చిప్పకుర్తీ సుధాకర్, సంఘ పెద్దలు అంకరి కుమార్, ఎం కే జోసెఫ్, మంథని ప్రసాద్, అందే రమేష్, చింతకుంట్ల ప్రేమ్ కుమార్, దాసరి సదానందం, రామగిరి కుమార్, ఈర్ల సదా నందంతో పాటు స్త్రీల కమిటీ నాయకులు హేమలత, పద్మజ ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల అభివృద్ధి పనులపై మున్సిపల్ అధికారులతో జగిత్యాల ఎమ్మెల్యే సమీక్ష సమావేశం

**జగిత్యాల ప్రతినిధి : నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్**

జగిత్యాల పట్టణ అభివృద్ధి పనులపై మున్సిపల్ అధికారులతో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జగిత్యాల పట్టణ అభివృద్ధి కోసం 50 కోట్ల యుఐడిఎఫ్ నిధులు, 12.5 కోట్ల రాష్ట్ర నిధులతో చేయాల్సిన పనులను 8 ప్యాకేజీలుగా విభజించి టెండర్లకు పిలిచినా, కాంట్రాక్టర్ లు రాని పనులకు కొద్దిపాటి మార్పులు చేసి మరల టెండర్ పిలవాలని మున్సిపల్ అధికారులను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆదేశించారు. ఇటువంటి విషయంలో రాష్ట్ర వ్యాప్తంగా మరోసారి టెండర్లకు పిలవడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. సోమవారం సిడిఎంఏ ఇంజనీర్ ఇన్ చీఫ్ అపాయింట్మెంట్ తీసుకోవడం జరిగిందని, జగిత్యాల పట్టణ అభివృద్ధి పనులు, టౌన్ ప్లానింగ్ పై పలు వినతులు చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. జగిత్యాల పట్టణంలో ముఖ్య వీధులు, ప్రధాన రోడ్డులు, డ్రైనేజీల పనులు పూర్తి చేయటానికి, పట్టణానికి సంబంధించిన టౌన్ ప్లానింగ్ ,అసెస్మెంట్ ,ఇంటి నెంబర్ విషయంలో ఇబ్బంది లేకుండా సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రికి విన్నవిస్తానని, జగిత్యాల ప్రజల చిరకాల వాంఛ యావర్ రోడ్డు విస్తరణ అని, టౌన్ ప్లానింగ్ అధికారులు పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని,కౌన్సిల్ ఆమోదం తెలిపిన పనులపై నివేదికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సూచించారు.



జగిత్యాల అభివృద్ధికి ప్రభుత్వం సానుకూలంగా ఉన్నందున జగిత్యాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ స్పందన, టిపిఓ శ్రీనివాస్, ఎఇ అనిల్, లక్ష్మి, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

## మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్

**పెగడపల్లి (ధర్మపురి) : నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 03 :**

పేదింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన లింగంపల్లి సుశీల - పెద్ద సత్తయ్య కు తెలంగాణ ప్రజా ప్రభుత్వం ద్వారా తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ సహకారంతో మంజూరు అయిన ఇందిరమ్మ ఇల్లును నిర్మించుకోగా, ఇందిరమ్మ ఇల్లును స్థానిక సర్పంచ్ ఒరుగల అరుణ - శ్రీనివాస్ తో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ ప్రారంభించి, గృహప్రవేశం చేయించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లింగంపల్లి మహేష్, చాట్ల విజయభాస్కర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐలేని వంశీధర్ రావు, మల్యాల ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



# పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

## తెలంగాణలో ఫసల్ బీమా యోజన అమలు చేయాలి

## బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం.

**పెగడపల్లి (ధర్మపురి) : నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 03 :**

జగిత్యాల జిల్లాలో గత మూడు రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి మామిడి, మొక్కజొన్న, వరి పంటల రైతులు తీవ్రంగా నష్టపోయారని పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి రైతులను ఆదుకోవాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యః ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మర్రిపెల్లి సత్యం మాట్లాడుతూ... జగిత్యాల జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు, ఈదురు గాలులకు నష్టపోయిన పంటలను అధికారులు వెంటనే పరిశీలించాలని కోరారు. రైతుల పట్ల ప్రకృతి కన్నెర్ర చేయడం బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఫసల్ బీమా యోజన పథకం అందుబాటులో లేనందున రాష్ట్ర ప్రభుత్వమే రైతులకు ఎకరాకు 50 వేల రూపాయల చొప్పున నష్ట పరిహారంగా ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు ఆకర్షణీయ పథకాలతో రెండు లక్షలు రుణమాఫీ ఎకరాకు 15000 రైతు భరోసా, కౌలు రైతులకు కూడా రైతు భరోసా, 500 రూపాయల బోనస్ కూడ ఇస్తామంటూ బోగస్ మాటలు చెప్పి రైతుల ఓట్లు వేయించుకొని రైతులను మోసం చేయటం సబబు కాదని విమర్శించారు. రైతులు పెట్టిన పెట్టుబడి కూడా రాకుండ ఉన్న సమయంలో అకాల వర్షాలు కురవడం మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందాన ఉందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి రైతు భరోసా నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిజెపి మండల అధ్యక్షులు పల్లె మోహన్ రెడ్డి, మాజీ అధ్యక్షులు గంగుల కొమురెల్లి, ప్రధాన కార్యదర్శి తోడేటి గట్టయ్య, బిజెపి మండల నాయకులు కడారి జనార్దన్, కోట మల్లేష్, జక్కుల హరీష్, తడగొండ శ్రీనివాస్, పెద్ది బీరయ్య, రాజిరెడ్డి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



# తవణంపల్లి మండలంలో దారుణ ఘటన

## యువకుడిని హత్యచేసి చెరువుల పడేసిన దుండగులు

**చిత్తూరు,ఏప్రిల్ 3(నేషనలిస్ట్ వాయిస్):**

చిత్తూరు జిల్లాలోని తవణంపల్లి మండలంలో దారుణ ఘటన వెలుగుచూసింది. మొదలపల్లి గ్రామానికి చెందిన లవ కుమార్ (28) అనే యువకుడిని గుర్తు తెలియని దుండగులు అత్యంత కిరాతకంగా హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని సమీప చెరువులో పడేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్థానికుల సమాచారం ప్రకారం.. లవకుమార్ గత కొంత కాలంగా అమర్ రాజా కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు అతడిని హతమార్చి, మృతదేహాన్ని సమీపంలోని చెరువులో పడేశారు. చెరువులో మృతదేహం తేలడాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పాత కక్షల వల్ల ఈ హత్య జరిగిందా? లేక మరేదైనా కారణం ఉందా అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించిన పోలీసులు, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# తవణంపల్లి మండలంలో దారుణ ఘటన

## యువకుడిని హత్యచేసి చెరువుల పడేసిన దుండగులు

**చిత్తూరు,ఏప్రిల్ 3(నేషనలిస్ట్ వాయిస్):**

చిత్తూరు జిల్లాలోని తవణంపల్లి మండలంలో దారుణ ఘటన వెలుగుచూసింది. మొదలపల్లి గ్రామానికి చెందిన లవ కుమార్ (28) అనే యువకుడిని గుర్తు తెలియని దుండగులు అత్యంత కిరాతకంగా హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని సమీప చెరువులో పడేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్థానికుల సమాచారం ప్రకారం.. లవకుమార్ గత కొంత కాలంగా అమర్ రాజా కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు అతడిని హతమార్చి, మృతదేహాన్ని సమీపంలోని చెరువులో పడేశారు. చెరువులో మృతదేహం తేలడాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పాత కక్షల వల్ల ఈ హత్య జరిగిందా? లేక మరేదైనా కారణం ఉందా అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించిన పోలీసులు, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# నేటి నుంచి రబీ ధాన్యం కొనుగోళ్లు

## రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,917 కొనుగోలు కేంద్రాలు

## వెల్లడించిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల

**కాకినాడ,ఏప్రిల్ 3(నేషనలిస్ట్ వాయిస్):**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది.. నేటి నుంచి రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలియజేశారు.. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,917 కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు పక్రియను సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు.ఇక, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేస్తామని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు. రైతులు తమ పంటకు సరైన ధర పొందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ధాన్యం నిల్వ మరియు రవాణా విషయంలో కూడా ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేసింది. మొత్తం 5.40 కోట్ల గోతాలను సిద్ధం చేసినట్లు, గోతాల కొరత రాకుండా మిల్లర్లతో ఇప్పటికే చర్చలు జరిపినట్లు తెలిపారు. అలాగే ధాన్యం రవాణా కోసం 17,200 లారీలను జీపీఎస్ సదుపాయంతో సిద్ధం చేసినట్లు వెల్లడించారు. మొత్తంగా, ఈసారి రబీ ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా, వేగంగా జరిగేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు ..

# మేడారంలో తీవ్ర విషాదం

## రాతి కట్టడం కూలి బాలుడికి గాయాలు

## ఆస్పత్రి తీసుకెళ్లగా కాలు తీసేసిన వైద్యులు

**ములుగు,ఏప్రిల్3(నేషనలిస్ట్ వాయిస్):**

ప్రముఖ పుణ్యక్షేత్రం మేడారంలో తీవ్ర విషాదం నెలకొంది. ఊహించని రీతిలో జరిగిన ప్రమాదం.. ఒక చిన్నారి జీవితంలో చీకటిని నింపింది. మేడారం పూజారి సిద్ధబోయిన రమేశ్ కుమార్ కొడుకు యువన్‌పై ఒక్కసారిగా రాతి కట్టడం కూలి పడటంతో ఈ దారుణం జరిగింది. వెంటనే తల్లిదండ్రులు చిన్నారిని ఆసుపత్రికి తరలించారు. బాలుడు యువన్ ఆడుకుంటున్న సమయంలో సమీపంలోని ఒక రాతి కట్టడం ఒక్కసారిగా అతడిపై పడింది. ఈ ప్రమాదంలో బాలుడి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే యువన్ తల్లిదండ్రులు, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. బాలుడిని తల్లిదండ్రులు హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. గాయం తీవ్రంగా ఉండటంతో ఇన్ఫెక్షన్ సోకకుండా ఉండేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో కాలును తొలగించాల్సి వచ్చిందని వైద్యులు తెలిపారు. తమ కళ్ల ముందు ఆడుకోవాల్సిన బిడ్డ.. ఇలా కాలు కోల్పోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో వారి ఆవేదన చూసి స్థానికులు సైతం చలించిపోయారు.

# ఎపిలో ఒక్కసారిగా మారిన వాతావరణం

## పలు జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం

## ఈదురుగాలులు కూడా ఉంటాయని హెచ్చరిక

**అమరావతి,ఏప్రిల్3(నేషనలిస్ట్ వాయిస్):**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అత్యవసర హెచ్చరిక జారీ చేసింది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉండనుందని, ఆయా జిల్లాల యంత్రాంగం ఇప్పటికే అప్రమత్తమైంది.వర్షంతో పాటు గంటకు 40 నుండి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండవద్దని సూచించారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, పొలాల్లో పనిచేసే రైతులు, పశువుల కాపరులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకు రావొద్దని, ప్రయాణాలను వాయిదా వేసుకోవడం ఉత్తమమని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, నదీ పరివాహక ప్రాంతాల వారు స్థానిక అధికారుల సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మరో వైపు తెలంగాణలోనూ రానున్న 3 రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ జిల్లాల్లో వర్షం పడే అవకాశముంది. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, జనగామ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి.

## అంతర్గాం తహసిల్దార్ తూము రవీందర్ పటేల్.

**కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 3.**





పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం టి టి ఎస్ అంతర్గాం గ్రామంలోని శ్రీ నూకాంబిక అమ్మవారి ని, సుందిళ్ల లక్ష్మీ నృసింహ స్వామిని అంతర్గాం తహ శీల్దార్ తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు, అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు తూము రవీందర్ పటేల్ -ఉమాదేవి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అంతర్గాం తహశీల్దార్ తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు, అబ్దుల్ కలాం చారిట బుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు రవీందర్ పటేల్ మాట్లాడుతూ నేను ఎక్కడ విధులు నిర్వహించిన అక్కడ ఉన్నటువంటి ప్రజలే నా కుటుంబం అనుకోని అక్కడి ప్రజల కోసం మా దంపతులం తప్పకుండా పూజలు నిర్వహించడం జరుగుతుంది. దీనిలో భాగంగానే శ్రీ నూకాంబిక అమ్మవారి ని, సుందిళ్ల లక్ష్మీ నృసింహ స్వామి వారిని దర్శించుకొని వారి అనుగ్రహంతో మండలంలోని, జిల్లాలోని ప్రజలు వారి కుటుంబ సభ్యులు అందరూ కూడా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ,అష్ట ఐశ్వర్యాలు కలిగేలా ఆ దేవానదేవతలు వీరందరిపై అనుగ్రహం ఆశీస్సులు ఇవ్వాలని నూకాంబిక అమ్మవారిని, సుందిళ్ల శ్రీలక్ష్మీ నృసింహ స్వామిని వేడుకోని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అనంతరం ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేసే అటువంటి స్థానిక వాస్తవం రిపోర్టర్ కందుగుల సంతోష -కుమార్ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా ఆ దంపతులను మా దంపతులం తూము రవీందర్ పటేల్ ఉమాదేవి దంపతులం వారికి నూతన వస్త్రాలను సమర్పించి ఆ దంపతులను ఆశీర్వదించడం జరిగిందని, పుణ్య దంపతులైన తూము రవీందర్ పటేల్ వారి సతీమణి ఉమాదేవి అంతర్గం తహశీల్దార్ తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు, ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ గౌర అధ్యక్షులు తూము రవీందర్ పటేల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతర్గాం తహశీల్దార్ ,తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు, ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు తూము రవీందర్ పటేల్ ఉమాదేవి దంపతులు, స్థానిక సర్పంచ్ ఆంగోతు రవికుమార్ నాయక్, పూజారి పేరం బుదురు రామాచార్యులు, స్థానిక ప్రజలు, యువకులు, శ్రేయోభిలాషులు,పాల్గొన్నారు.

# వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ

## ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్ల నుంచి అక్రమాలపై ఆరా

## తనిఖీల్లో అక్రమ లావాదేవీలు, లంచాలు గుర్తింపు

## భారీగా నగదు, నగలు, అనేక డాక్యుమెంట్లు స్వాధీనం

**వరంగల్,ఏప్రిల్3(నేషనలిస్ట్ వాయిస్):**

వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నగదు, డాక్యుమెంట్లు ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ల నుంచి స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్-1 జమాలపురం రామనరసింహారావు, రిజిస్ట్రార్-2 దేవులూరి ఆనంద్ ఫోన్లను స్వాధీనం చేసుకుని పరిశీలించారు. ఇద్దరు అధికారులు డాక్యుమెంట్ రైటర్లతో జరిపిన ఫోన్ పే పరిశీలించగా సుమారు రూ.42 లక్షలు లావాదేవీలు జరిపినట్లు గుర్తించారు. వీరి వద్ద నుంచి 70 రిజిస్ట్రేషన్ కాని డాక్యుమెంట్లను పరిశీలించారు. అదే విధంగా ఇద్దరు ఇళ్ల నుంచి రూ.24.61 లక్షల నగదును, 819.500 గ్రాముల బంగారు ఆభరణాలను, 2.600 కిలో గ్రాముల వెండి ఆభరణాలను, రూ.30 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లను గుర్తించారు. ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు గుర్తించి ప్రభుత్వానికి పంపనున్నట్లు వెల్లడించారు. వరంగల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అవినీతి అక్రమాలపై అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదులు అందడంతో మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సబ్ రిజిస్ట్రార్ల అక్రమ లావాదేవీలు, అనధికారిక వ్యక్తులతో వారు సాగిస్తున్న చీకటి ఒప్పందాలు వెలుగులోకి వచ్చాయి. సబ్ రిజిస్ట్రార్లయిన జమాల్పూర్ రామ్ నర్సింహారావు, దేవులూరి ఆనంద్ తమ కార్యాలయంలో ఇద్దరు వ్యక్తులను అనధికారికంగా డాక్యుమెంట్ రైటర్లుగా నియమించుకున్నట్లు ఏసీబీ గుర్తించింది. వీరిద్దరూ డాక్యుమెంట్ రైటర్లతో కలిసి రిజిస్ట్రేషన్ల పేరుతో భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. కేవలం ఈ అనధికారిక రైటర్లు పంపిన పత్రాలను మాత్రమే వీరిద్దరు ప్రాధాన్యత ఇచ్చి రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తేలింది. కార్యాలయంలో పూర్తి కాని సుమారు 70 డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్లు, డాక్యుమెంట్ రైటర్ల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలు వాట్సాప్ చాట్ ద్వారా బట్టబయల య్యాయి. గత ఏడాది కాలంలోనే డాక్యుమెంట్ రైటర్ల ద్వారా ఈ ఇద్దరు అధికారులు సుమారు రూ. 42 లక్షలను లంచంగా తీసుకున్నట్లు ఏసీబీ ఆధారాలు సేకరించింది. కార్యాలయంలో సోదాల అనంతరం ఏసీబీ బృందాలు ఇద్దరి నివాసాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టాయి. వీరి ఇళ్లలో లక్షలాది రూపాయల నగదుతో పాటు భారీగా అక్రమ ఆస్తులకు సంబంధించిన పత్రాలను అధికారులు కనుగొన్నారు. ఇక్కడ ఓ షాకింగ్ అంశం వెలుగులోకి వచ్చింది. ఓ అధికారి ఇంట్లో రిజిస్ట్రేషన్ చేయని 254 ప్రభుత్వ పత్రాలు లభించడం అధికారులను సైతం విస్మయానికి గురిచేసింది. ప్రభుత్వ కార్యాలయంలో ఉండాల్సిన పత్రాలు అధికారుల ఇళ్లలో ఎందుకు ఉన్నాయనే కోణంలో ఏసీబీ దర్యాప్తు చేస్తోంది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఈ ఇద్దరు అధికారులపై ఏసీబీ కేసులు నమోదు చేసింది. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న నగదు, డాక్యుమెంట్లు, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తున్నారు.

# కాంగ్రెస్‌పై రెండేళ్లలోనే ప్రజల్లో వ్యతిరేకత

## రేవంత్ రెడ్డి దిగిపోవాలని కోరుకుంటున్నారు

## మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

**జగిత్యాల,ఏప్రిల్3(నేషనలిస్ట్ వాయిస్):**

కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ రానున్న రోజుల్లో ఊహించలేని పరిస్థితి ఎదుర్కొంటుందని కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి జోస్యం చెప్పారు. తాను ఏ పార్టీలో చేరాలనేది కార్యకర్తల కోరిక మేరకే ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు విసుగొచ్చిన రాష్ట్ర ప్రజలు మార్పు రావాలి.. రేవంత్ రెడ్డి పోవాలనే ఆలోచన వచ్చిందన్నారు. జగిత్యాలలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజల సంక్షేమంతో పాటు ప్రాజెక్టుల నిర్వహణ ప్రధాన అంశమని తెలిపారు. తెలంగాణకు జీవనాడి ప్రాణహిత జలాలను వాడుకోవడంలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని ఆయన తెలిపారు. అభిమానుల ఆలోచనలకు అనుగుణంగా ఏ పార్టీలో చేరాల నేదానిపై నిర్ణయం తీసుకుంటానని జీవన్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్‌ను వీడిన తర్వాత జగిత్యాలలో తొలిసారిగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. ప్రాణహిత నదీ జలాలను వినియోగించు కోకపోవడం, పునరుద్ధరించకపోవడం రేవంత్ నిర్లక్ష్య పాలనకు నిదర్శనమని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన రెండేళ్లలోనే మార్పు రావాలనే పరిస్థితి వచ్చిందన్నారు. భాజపా, బీఆర్‌ఎస్ నాయకులకు తనపై ఉన్న అభిమానానికి జీవన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అయితే మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు సమాచారం. త్వరలోనే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జగిత్యాలకు వెళ్లి జీవన్ రెడ్డిని ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 13న జీవన్ రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఆ రోజు మంచి ముహూర్తం ఉండటంతో గులాబీ కండువా కప్పుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నెల 6న అమెరికా నుంచి తిరిగి వచ్చిన వెంటనే కేటీఆర్.. జీవన్ రెడ్డిని కలిసి పార్టీలోకి ఆహ్వానించనున్నట్లు సమాచారం. జగిత్యాల నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేసేందుకు జీవన్ రెడ్డిని పార్టీలోకి తీసుకోవాలని కేటీఆర్ భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీకి, క్రియాశీల సభ్యత్వానికి జీవన్ రెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేసిన ఆయన.. నిత్యం జనంలోనే ఉంటూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జగిత్యాల ప్రాంతంలో బలమైన నేతగా ఉన్న జీవన్ రెడ్డి.. గులాబీ పార్టీలో చేరితే స్థానికంగా బీఆర్‌ఎస్‌కు మంచి ప్రయోజనం కలుగుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.


# ఇరిగేషన్ అధికారులు తీరు మార్చుకోవాలి

## గత ప్రభుత్వంలో లాగా చేస్తామంటే కుదరదు

## సిఈలతో వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి నిమ్మల రామానాయుడు

**అమరావతి,ఏప్రిల్3(నేషనలిస్ట్ వాయిస్):**

గతంలో ప్రభుత్వంలో వ్యవహరించినట్లుగా కాకుండా, ఇరిగేషన్ అధికారులు తీరు మార్చుకోవాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు . శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సిఈలతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన మంత్రి నిమ్మల నియోజకవర్గాల వారీగా కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికతీత, వంటి పనులకు సంబందించిన అంచనాల తయారీపై సమీక్ష నిర్వహించారు. ఆయా పనులకు సంబందించి మార్చి 25వ తేదీలోపు నియోజకవర్గాల వారీగా అంచనాలు రూపొందించి పంపించాలని ఆదేశించినా, ఇప్పటివరకు కొంత మంది చీఫ్ ఇంజనీర్లు సరిగా అంచనాలు సమర్పించకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, మట్టి పూడిక తీత వంటి పనులు చేయడానికి ఏప్రియల్, మే, నెలలో మాత్రమే అవకాశం ఉంటుంది. ఆతరువాత ఖరీఫ్ సీజన్ మొదలైతే పనులు చేయడానికి అవకాశం ఉండదని, గతంలో ఏప్రియల్, మే నెలలో చేయాల్సిన పనులకు జూన్ లో అనుమతులు ఇచ్చేవారని, పనులు మొదలుపెట్టిన వెంటనే కాలువలకు నీళ్ళు వదిలేవారని, దీంతో పనులు సగంలోనే వదిలేయాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ఇలా చేయడం వల్ల ఆయకట్టు చివరన ఉన్న పొలాలకు సాగు నీరందక రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని, ఇలా గతంలో వ్యవహరించిన తీరులో కాకుండా ముందుగానే అంచనాలు రూపొందించి, ఆర్దిక శాఖ అనుమతులు పొందితే సీజన్ మొదలయ్యేలోగా పనులు కూడా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. కావున నియోజకవర్గాల వారీగా పనులకు సంబందించిన అంచనాలను ఆదివారం సాయంత్రం లోగా పంపాలని సిఈలను ఆదేశించారు. గడువులోగా అంచనాలను పంపని అధికారులు సోమవారం అమరావతి సచివాలయంకు వచ్చి అంచనాలు ఎందుకు పంపలేకపోయారో సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉంటుందని తీవ్రంగా మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అత్యవసర పనుల కింద నిధులు విడుదల చేసి, కాలవల్లో పూడిక తీత, తూడు, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనులను చేయడం ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరందించగలిగామని తెలిపారు. గత 5ఏళ్ళ వైసిపి ప్రభుత్వ పాలనలో కనీస నిర్వహణ పనులు సైతం పట్టించుకోకపోవడంతో



ఆయకట్టు చివరి ఎకరం వరకు నీరందక రైతులు ఇబ్బంది పడ్డారని, నేడు కూటమి ప్రభుత్వం ప్రతి ఎకరాకు సాగు నీరందించడమే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నామని స్పష్టం చేశారు. కావున అధికారులు నిర్లక్ష్యం వదిలి గడువులోగా ఇరిగేషన్ పనులకు సంబందించిన అంచనాలు సమర్పించి, సీజన్ మొదలయ్యేలోగా, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# వేసవిలో నవ్వుల వినోదం

## నీహారిక రాకాస చిత్రం

కమిటీ కుర్రోళ్లు'తో నిర్మాతగా తన అభిరుచిని చాటారు నిహారిక కొణిదెల. ఇప్పుడు సంగీత్ శోభన్ కథానాయకుడిగా బలమైన ప్రచారంతో 'రాకాస' సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. వీరబాబు అలియాస్ వీరు (సంగీత్ శోభన్) తాను ప్రేమించిన అమ్మాయి కోసం అమెరికా నుంచి ఎంతో హుషారుగా ఊరికి తిరిగొస్తాడు. అయితే అప్పటివరకూ తనని ఫోన్ కాల్స్‌లో కవ్విస్తూ, ముద్దు ముద్దుగా మాట్లాడిన ఆ అమ్మాయి మరొకరితో పెళ్లి పీటలెక్కేందుకు సిద్ధమైందని తెలుసుకుంటాడు. ఎలాగైనా ఆ పెళ్లిని ఆపాలని తన స్నేహితుడు బాలు (గెటప్ శ్రీను)తో కలిసి రకరకాల ప్రయత్నాలు చేస్తుంటాడు. అందులో భాగంగా తనతోపాటు చిన్నప్పుడు కలిసి చదువుకున్న సుబ్బలక్ష్మి (నయన్ సారిక)నీ కలుస్తారు. చివరికి వీరు, సుబ్బలక్ష్మి మధ్య ప్రేమ చిగురిస్తుంది. ఊరి సమీపంలోని రాక్షస కోట నరబలి కోరడం అక్కడ ఆనవాయితీ. మూడు సంకేతాల తర్వాత ఊరంతా కలిసి ఒకరి పేరుని ఖరారు చేస్తుంటారు. ఆ వ్యక్తిని కోటలోకి పంపుతారు. అలా చేస్తేనే ఊరికి మంచి జరుగుతుందని, లేదంటే బ్రహ్మ రాక్షసుడి కారణంగా ఊరంతా నాశనమవుతుందనేది స్థానికుల నమ్మకం. అయితే ఊహించని రీతిలో వీరు కోటలోకి వెళ్లాల్సి వస్తుంది. మరి కోటలోకి వెళ్లిన వీరు తిరిగొచ్చాడా? అతన్ని కాపాడేందుకు సుబ్బలక్ష్మి, బాలు ఏం చేశారు? ఇంతకీ ఆ కోటలో ఉన్న రాక్షసుడి చరిత్ర ఏమిటనే విషయాల్ని తెరపై ప్రదర్శించారు. ఒక కోట...అందులో భీకరమైన బ్రహ్మ రాక్షసి అనగానే ఎవరికైనా హారర్ నేపథ్యమే గుర్తొస్తుంది. ప్రచార చిత్రాలు కూడా అదే అభిప్రాయాన్నే కలిగిస్తాయి. కానీ, ఈ సినిమా భయపెట్టడం కంటే కూడా, ఫాంటసీ ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ కథలో లీనం చేయడంపైనే ఎక్కువగా దృష్టి పెట్టింది. హారర్ కామెడీతో కాకుండా, ఓ ఫాంటసీ కామెడీ కథగా దీనిని తీర్చిదిద్దారు. థియేట్రికల్ అనుభూతిని పంచేలా సాగే కోట నేపథ్యంలోని సన్నివేశాలు, ద్వితీయార్ధంలో కామెడీ సినిమాకి బలం. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో చెప్పినట్టుగా సన్నివేశాలన్నీ చందమామ కథలా చిన్నారులకు నచ్చేలా ఉంటాయి. ఊరి కథ, మూడు హెచ్చరికలు అంటూ సినిమా ఆసక్తికరంగానే మొదలవుతుంది. ద్వితీయార్ధంలో హీరో కోటలోకి వెళ్లినప్పట్నుంచే సినిమా అసలు సిసలు ఆసక్తిని రేకెత్తిస్తుంది. కోటని చూపించిన విధానం, తర్వాత ఏం జరుగుతుందనే ఆసక్తిని రేకెత్తించిన తీరు, రాక్షసుడి చరిత్ర, ప్రధాన పాత్రలు భయపడుతూనే నవ్వించడం సినిమాకి కలిసొచ్చింది. ప్రేక్షకుల ఊహలకు అందని విధంగా పతాక సన్నివేశాలు మలిచారు. కొన్ని మలుపులు మెప్పిస్తాయి. ద్వితీయార్ధం స్థాయిలో ప్రథమార్ధం కూడా ప్రభావం చూపించి ఉంటే ఈ సినిమా ఫలితం వేరుగా ఉండేది. మొత్తంగా అక్కడక్కడా నవ్విస్తూ, భయపెడుతూ, సెలవుల్లో పిల్లలు ఆస్వాదించేందుకు తగ్గ సరికొత్త కాల్పనిక ప్రపంచాన్ని ఆవిష్కరించిన చిత్రమిది. వీరు పాత్రలో సంతోష్ శోభన్ ఒదిగిపోయాడు. గెటప్ శ్రీను, వెన్నెల కిశోర్, నయన్ సారికతో కలిసి ఆయన చేసిన అల్లరి అక్కడక్కడా నవ్వించింది. కామెడీలో బలం లేకపోయినా సరే, తన నటనతో ఆ సన్నివేశాలపై ప్రభావం చూపించే ప్రయత్నం చేశారు. వెన్నెల కిశోర్ పాత్ర పరిచయం తర్వాత సినిమాలో కామెడీ మోతాదు పెరిగింది. బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి పాత్రలు సినిమాలో ప్రధానంగా కనిపిస్తాయి. ఆశిష్ విద్యార్థి, రోహన్ రాయ్ తదితరులు పాత్రల పరిధి మేరకు నటించారు.




# పాకెట్ నవల్ మూవీతో ఎంతో నేర్చుకున్నా

## నటి మాళవికా మోహనన్

ఒంటరితనం వల్ల తాను ఎంతో బాధ పడ్డానని నటి మాళవిక మోహనన్ తెలిపారు. సోషల్‌మీడియా వేదికగా మార్చి నెల అనుభవాలను అభిమానులతో పంచుకున్న ఆమె ఈమేరకు పోస్ట్ పెట్టారు. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే.. త్యాగరాజన్ కుమారరాజ దర్శకత్వంలో 'పాకెట్ నవల్' కోసం వర్క్ చేయడం. అత్యుత్తమ దర్శకుల్లో ఆయన ఒకరని నిస్సందేహంగా చెప్పగలను. ఆయన మూవీ మేకింగ్ స్టైల్‌ను గమనించడం.. ఆయన మార్గదర్శకత్వంలో నటిగా నన్ను నేను మలుచుకోవడం.. కెరీర్‌పరంగా అదొక అద్భుతమైన సృజనాత్మక అనుభవం. షూటింగ్‌లో భాగంగా నెలలో చాలా రోజులు చెన్నైలోనే గడిపా. వర్క్ మంచిగానే ఉన్నప్పటికీ ఇంటికి అంతకాలం దూరంగా ఉండటం ఊహించిన దానికంటే ఎక్కువగా కుంగదీసింది. రోజంతా కష్టపడి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఒక్కదాన్నే ఉన్నాననే ఫీలింగ్ అంత సులభంగా తీసుకోలేకపోయా. నా కుటుంబసభ్యులు నన్ను చూడటానికి చెన్నై వచ్చినప్పుడు నాకెంతో ఉపశమనంగా అనిపించింది. చెన్నై, మహాబలిపురంలోని దేవాలయాలను సందర్శించా. ఇష్టమైన భోజనం చేశా. హాయిగా సమయాన్ని ఆస్వాదించా. కొన్ని రోజుల క్రితమే ముంబయికి తిరిగివచ్చా. ఇంటికి దూరంగా ఉన్నాననే భావన నుంచి బయటకు వచ్చేందుకు సాయంత్రం వేళల్లో పడవ ప్రయాణానికి వెళ్లేదానిని అని మాళవిక రాసుకొచ్చారు.



# ఓటిటిలోకి ఎస్ సరస్వతి మూవీ

వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన సైకలాజికల్ థ్రిల్లర్ 'ఎస్. సరస్వతి'. గత నెల మార్చి 6న థియేటర్లలో విడుదలై ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి అడుగుపెట్టింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాలో వరలక్ష్మితో పాటు ప్రకాశ్ రాజ్, ప్రియమణి, జీవా, మురళీ శర్మ, రావు రమేశ్, రాధికా శరత్‌కుమార్ వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషించారు. కథ విషయానికి వస్తే, లక్ష్మి అనే ఓ అనాథ మహిళ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ తన కూతురు 'ఎస్. సరస్వతి'ని ఎంతో ప్రేమగా పెంచుకుంటుంది. అయితే ఆగస్టు 15న తన కూతురిని స్కూల్లో దించి ఉద్యోగానికి వెళ్లిన లక్ష్మి.. ఆ తర్వాత తన కూతురు కనిపించడం లేదని, స్కూల్లోనే ఆమెపై అఘాయిత్యం జరిగిందని పోలీసులను ఆశ్రయిస్తుంది. పోలీసులు విచారించగా అసలు అలాంటి పాపే ఆ స్కూల్లో లేదని తేలడంతో కథ ఊహించని మలుపు తిరుగుతుంది. ఇంతకీ ఆ పాప ఏమైంది, లక్ష్మి చెబుతున్నది నిజమా లేక ఇదంతా ఆమె భ్రమా అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సస్పెన్స్ థ్రిల్లర్ సాగుతుంది. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన వారు ఇప్పుడు నేరుగా ప్రైమ్ వీడియోలో ఈ చిత్రాన్ని వీక్షించవచ్చు.



# ఒత్తిడిని తట్టుకునే చిట్కాలతో ముందుకు సాగుతా: శ్రీలీల

పాత్రలో లీనమవడం ఎంత ముఖ్యమో, దానినుంచి బయటకు రావడం కూడా అంతే ముఖ్యం. షూటింగ్ ఒత్తిడి నుంచి బయటపడటానికి నేను కొన్ని చిన్నచిన్న అలవాట్లను చేసుకున్నాను. సంగీతం వినడం, కాసేపు ఒంటరిగా గడపడం, కుటుంబసభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడటం వంటివి నాకు ఉపశమనాన్ని ఇస్తాయని నటి శ్రీలీల తన అనుభవాలను పంచుకున్నారు. ఫ్రెండ్స్‌తో చిట్‌చాట్ చేయడం నాకు రిలీఫ్‌గా ఉంటుంది. నేను పని ఒత్తిడిని ఇంటికి తీసుకెళ్లకూడదని ప్రయత్నిస్తాను. ఒకవేళ పొరపాటున అలా జరిగినా, పైన చెప్పిన చిన్న చిన్న పద్ధతులు నన్ను మళ్లీ మామూలు స్థితికి తీసుకువస్తాయి. కొన్నిసార్లు పరిస్థితులకు అనుగుణంగా మనల్ని మనం సర్దుబాటు చేసుకుంటూ ముందుకుసాగడమే ఏకైక మార్గం అని శ్రీలీల తెలిపారు. ప్రస్తుతం శ్రీలీల కోలీవుడ్‌లో బిజీగా మారింది. 'పరాశక్తి'తో తమిళనాట అడుగుపెట్టిన ఆమె ధనుష్‌తో కలిసి 'డీ55' (వర్కింగ్ టైటిల్)లో నటిస్తోంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఇది రానుంది. దీనితో పాటు అనురాగ్ బసు దర్శకత్వంలో బాలీవుడ్ ఎంట్రీకి కూడా శ్రీలీల సిద్ధమవుతున్నారు.

PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656